http://www.agnidharanews.com

# అగ్నిధార

బుధవారం 12 ఫిబ్రవరి 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు


సెల్ : 80088 17828

# రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు!?

- ఉపఎన్నికలకు సిద్ధమౌతున్న పార్టీలు
- బీఆర్ఎస్ పార్టీలో గెలిచి.. కాంగ్రెస్ గూటికి చేరిన జంపింగ్ ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం చేస్తోంది కారు పార్టీ.
- ఆ పది మంది ఎమ్మెల్యేలపై వేటు పక్కా.. ఉప ఎన్నికలు కూడా ఖాయం అంటూ ధీమాతో బీఆర్ఎస్
- తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ టైమ్ కావాలంటూ గడువు కోరడంతో ఇప్పటికే ఓసారి సుప్రీంకోర్టు సీరియస్ అయింది.
- గతంలో సుప్రీంకోర్టు జోక్యంతో చాలా రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు
- ఇప్పుడు తెలంగాణలోనూ ఇదే రిపీట్ కాబోతోందా అన్న చర్చ సాగుతోంది

వివరాలు 3లో..

తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేల స్టోరీ క్లైమాక్స్‌కు చేరినట్లే కనిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి..కాంగ్రెస్ గూటికి చేరిన జంపింగ్ ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం చేస్తోంది కారు పార్టీ. అందులో భాగంగానే సుప్రీంకోర్టులో వరుస విచారణలు జరుగుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ టైమ్ కావాలంటూ గడువు కోరడంతో ఇప్పటికే ఓసారి సీరియస్ అయింది. రీజనబుల్ టైమ్‌పై మరోసారి అసెంబ్లీ స్పీకర్‌పై ప్రశ్నలు కురిపించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారి ఇప్పటికే పది నెలలు పూర్తయ్యింది. అయినా స్పీకర్ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో..పది నెలల సమయం రీజనబుల్ టైమ్ కాదా అని క్వశ్చన్ చేసింది సుప్రీంకోర్టు. ఆ తర్వాత మిగతా విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.




# చెల్లెల్ని చూసి నేర్చుకో

- కేటీఆర్‌కు కొండా సురేఖ కౌంటర్
- రీ సర్వే చేయాలంటే.. కేటీఆర్, ఆయన కుటుంబం దరఖాస్తు చేసుకోవాలి
- ఎమ్మెల్యేలలో అసంతృప్తి అనేది నాకు తెలీదు
- నేను ఎవరిని ఎంకరేజ్ చేయడంలేదు
- దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరత ఉంది



హైదరాబాద్

సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కొండా సురేఖ కౌంటర్ ఇచ్చారు. రీ సర్వే చేయాలంటే.. కేటీఆర్, ఆయన కుటుంబం దరఖాస్తు చేసుకోవాలి. సర్వే అంటున్న కేటీఆర్.. చెల్లి కవితను చూసి నేర్చుకోవాలి. సర్వే, ప్రొఫార్మాలో ఎక్కడ తప్పులు జరిగాయో కేటీఆర్ చెప్పాలి. ఎమ్మెల్యేలలో అసంతృప్తి అనేది నాకు తెలీదు..నేను ఎవరిని ఎంకరేజ్ చేయడం లేదు. దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరత ఉంది. అడ్మినిస్ట్రేషన్‌కు ఇబ్బంది అవుతుంది. - మిగతా3లో

# మా పోరాటం ఆగదు..



- రైతుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైంది
- రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు
- రైతుల కోసం తాము నిరంతర పోరాటం కొనసాగిస్తాం
- రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం
- రేవంత్ ప్రభుత్వానికి హరీష్‌రావు మాస్ వార్నింగ్




## పక్షపాతం లేని ఏఐని అభివృద్ధి చేద్దాం

- మానవాళికి దిశానిర్దేశం చేసేందుకు ఏఐ అవసరం
- లక్షలాది జీవితాలను మార్చేది ఏఐ
- ఫ్రాన్స్ ఏఐ సమ్మిట్‌లో ప్రధాని మోదీ..
- “మానవజాతి దిశను నిర్దేశించే ఏఐ యుగం ప్రారంభంలో మనం ఉన్నాం
- భారతదేశం తన వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తనదైన భాషా ప్రధాన ఏఐ నమూనాను సృష్టిస్తోంది
- కంప్యూటింగ్ వనరులను సమీకరించడానికి ఇండియాకు ఒక ప్రత్యేకమైన ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య నమూనా ఉంది

# న్యాయం చేస్తాం

‘ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయి’

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంద కృష్ణ మాదిగ భేటీ



- ‘గత మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతుంది
- సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది
- ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీ లో తీర్మానం చేసిన సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు.
- రేవంత్ రెడ్డి ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలిచారు,
- సోదరుడిగా నేనూ అండగా నిలుస్తా!: మంద కృష్ణ మాదిగ

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ సందర్భాల్లో ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలిచారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ముఖ్యమంత్రికి ఒక సోదరుడిగా తానూ అండగా ఉంటానన్నారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా మేలు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఆయన అన్నారు. ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి భాగస్వామ్యమ - మిగతా3లో

# ఈవీఎంల్లో డేటాను డిలీట్ చేయవద్దు

- ఈవీఎంల్లో నిక్షిప్తమైన డేటాపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పిటిషన్
- డేటా డిలీట్ చేసే ప్రక్రియనుబ చేపట్టవద్దని ఎన్నికల కమిషన్‌కు ఆదేశం
- ఎన్నికల పూర్తియిన తర్వాత ఈవీఎంలకు సంబంధించి ఎలాంటి నిర్ధిత ప్రమాణాలు పాటిస్తున్నారో చెప్పాలని ఈసీకి స్పష్టం
- ఏవిధమైన డేటాను ఈవీఎంల నుంచి తొలగించవద్దు
- అదే సమయంలో ఏ తరహా డేటాను అందులో రీలోడ్ చేయవద్దు’



# రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు

- ఛత్తీస్‌గఢ్ మావోయిస్టుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో భద్రతా పరమైన ఇబ్బందులు కారణంగా రాహుల్ పర్యటన రద్దు
- బీసీ కుల గణన అంశంలో ప్రజల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది
- రైల్వే ప్రైవేటీకరణ అంశంపై రైలు ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సేకరించాల్సి ఉంది



# పక్షపాతం లేని ఏఐని అభివృద్ధి చేద్దాం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం ఫ్రాన్స్ పర్యటనలో ఉన్నారు. ఇవాళ పారిస్‌లో జరుగుతున్న ఏఐ శిఖరాగ్ర సమావేశంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుల్ మెక్రాన్‌లో కలిసి ప్రధాని మోదీ అధ్యక్షత వహించిన ఆయన..ఈ సమావేశంలో పలు విషయాల గురించి ప్రసంగించారు. మానవుల దైనందిన జీవితాల్లో కృత్రిమ మేధస్సు ఎలా కీలక పాత్ర పోషిస్తుందనే దాని గురించి విస్తృతంగా చర్చించారు. ఏఐ ప్రయోజనాలను అందరితో పంచుకోవాలని చెబుతూనే.. కృత్రిమ మేధస్సు పక్షపాతం చూపించే గురించి కూడా హెచ్చరించారు.

**ఏఐ యుగం ప్రారంభంలో ఉన్నాం: మోదీ**

పారిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ, "మానవజాతి దిశను నిర్దేశించే ఏఐ యుగం ప్రారంభంలో మనం ఉన్నాం" అని అన్నారు. భారతదేశం తన వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తనదైన భాషా ప్రధాన ఏఐ నమూనాను సృష్టిస్తోందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంప్యూటింగ్ వనరులను సమీకరించడానికి ఇండియాకు ఒక ప్రత్యేకమైన ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య నమూనా ఉందని..



దీనిని స్టార్టప్‌లు, పరిశోధకులకు సరసమైన ధరకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఏఐ టెక్నాలజీ రూపకల్పనలోని అనుభవాలను, నైపుణ్యాలకు భారతదేశం ఇతర దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

**పక్షపాతం లేని ఏఐని అభివృద్ధి చేద్దాం: మోదీ**

"మనమంతా మన వనరులను, ప్రతిభను ఒకచోట చేర్చుకోవాలని ప్రధాని మోదీ ఏఐ సమ్మిట్‌లో వెల్లడించారు. నమ్మకమైన, పారదర్శకతను పెంపొందించే ఓపెన్ సోర్స్ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని.. పక్షపాతం లేని నాణ్యమైన డేటాసెట్‌ల ను అభివృద్ధి చేసి ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చాలని అన్నారు. ఏఐ అనేది ప్రజలే కేంద్రీకృతంగా పని చేసేలా ఉం డాలి. సైబర్ భద్రత, తప్పుడు సమాచారం, నకిలీలకు సంబం ధించిన ఆందోళనలను మనమే పరిష్కరించాలి" అని తెలిపారు.

**లక్షలాది జీవితాలను మార్చేది ఏఐ: మోదీ**

ప్రధానమంత్రి మోదీ ఏఐ లక్షలాది మంది జీవితాలను మార్చడానికి ఎలా సహాయపడుతుందో ఏఐ శిఖరాగ్ర సదస్సులో వివరంగా చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం ఇలా మరిన్ని రంగాలకు కృత్రిమ మేధ విస్తరణ చేయవచ్చని ఆయన అన్నారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సులభంగా, వేగంగా చేరుకునే ప్రపంచాన్ని సృష్టించడంలో కూడా ఏఐ తప్పక సహాయపడుతుందని ఉద్ఘాటించారు.

# రేపటి నుంచి మహా కుంభమేళాలో..
# ఈ సమయాల్లో నో వెహికల్ జోన్ రూల్.. రూట్ మ్యాప్ విడుదల

మహా కుంభమేళాలో రేపు (ఫిబ్రవరి 12) మాఘ పూర్ణిమ రాజస్నానం. ఈ సందర్భంగా బుధవారం అమృత స్నానం చేయాలని భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. కొన్ని రోజుల ముందు నుంచే ప్రయాగ్‌రాజ్ చుట్టు పట్ల రెండు రోజుల ముందు నుంచే దాదాపు 300 కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. వేలాది మంది భక్తులు దాదాపు 30 గంటలుగా ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నారు. మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో ఉంచుకుని మహా కుంభమేళాలో జనసమూహ నియంత్రణకు నో వెహికల్ జోన్ రూల్ తీసుకొచ్చింది యూపీ ప్రభుత్వం. ఏయే సమయాల్లో ఈ నిబంధన జాతర జరిగే ప్రాంతంలో వర్తిస్తుందో రూట్ మ్యాప్ విడుదల చేసింది.



**ప్రయాగ్‌రాజ్‌లో భారీ ట్రాఫిక్ జామ్**


రేపు (ఫిబ్రవరి 12) మాఘ పూర్ణిమ అమృత స్నానం కోసం కావున మహాకుంభమేళాకు వచ్చే భక్తుల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ప్రయాగ్‌రాజ్ చుట్టుపట్ల 300 కి.మీ మేర వాహనాల నిలిచిపోవడమే ఇందుకు సాక్ష్యం. జాతర జరిగే ప్రాంతంలో భక్తులు నిమిషాల్లో నడవగలిగే దూరాన్ని చేరుకునేందుకు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. మౌని అమావాస్య నాడు జరిగినట్లుగా తొక్కిసలాట ఏర్పడకుండా భక్తుల రద్దీ నియంత్రణకు ఈ సారి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది యూపీ ప్రభుత్వం. నో వెహికల్ జోన్ రూల్ సహా వీవీఐపీ పాసులను రద్దు చేస్తూ నిబంధనలు తీసుకొచ్చింది.

**ఈ సమయాల్లో నో పార్కింగ్ రూల్.. వీవీఐపీ పాసులు రద్దు..**

జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళాను ఇప్పటి వరకూ 40 కోట్లకు మందికి పైగా భక్తులు సందర్శించారు. ఫిబ్రవరి 26 కుంభమేళాలో ఆఖరిరోజు. రేపటి నుంచి నియమిత ప్రదేశాల్లో మాత్రమే పార్కింగ్ అందుబాటులో ఉంటుంది. మహా కుంభమేళాకు 11 జిల్లాల నుంచి వచ్చే వాహనాల కోసం రూట్ ప్లాన్ విడుదల చేసింది ప్రభుత్వం. 36 పార్కింగ్ స్థలాలలో మాత్రమే వాహనాలను పార్క్ చేయగలరు. సోమవారం రాత్రి 8 గంటల నుంచే మహాకుంభమేళా ప్రాంతంలో పరిపాలనా/వైద్య వాహనాలు మినహా అన్ని రకాల వాహనాలను నిషేధించారు. ఫిబ్రవరి 13 గురువారం ఉదయం 8 గంటల వరకు ఈ నిబంధన అమలవుతుంది. భక్తులు సజావుగా స్నానం చేయడానికి వీలుగా ఫిబ్రవరి 11 ఉదయం 4 గంటల నుంచే మొత్తం మేళా ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్'గా ప్రకటించారు. అత్యవసర సేవలకే అనుమతి ఉంటుంది. అయితే, ఫిబ్రవరి 11న సాయంత్రం 5 గంటల తర్వాత ప్రయాగ్‌రాజ్‌లో 'నో వెహికల్ జోన్' అమలు చేయరు. మహా కుంభ స్నానానికి బయటి నుంచి వచ్చే భక్తులు వాహనాలను ఫిబ్రవరి 11న ఉదయం 4 గంటల తర్వాత సంబంధిత పార్కింగ్ స్థలాల్లోనే పార్క్ చేయాలి. అవసరమైన, అత్యవసర సేవల వాహనాలకు మినహాయింపు ఉంటుంది. ఫిబ్రవరి 12న మేళా ప్రాంతం నుంచి భక్తులను సజావుగా తరలించే వరకూ అడ్వైజరీలో పేర్కొన్న ట్రాఫిక్ రూల్స్ అమల్లో ఉంటాయి. ప్రయాగ్‌రాజ్, మేళా ప్రాంతంలో వాహనాల ప్రవేశం, నిష్క్రమణపై ఉన్న ఈ ఆంక్షలు 'కల్పవాసి' వాహనాలకు కూడా వర్తిస్తాయి.

# జేఈఈ మెయిన్ తొలి సెషన్ ఫలితాలు విడుదల..
# 14 మంది విద్యార్థులకు 100 పర్సంటేజ్

**ఢిల్లీ :** ఐఐటీ, జేఈఈ లాంటి కఠినతరమైన పరీక్షల్లో విద్యార్థులు సరికొత్త రికార్డ్‌లు సృష్టించారు. కొద్ది సేపటి క్రితం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జేఈఈ మెయిన్ 2025 సెషన్ వన్ ఫలితాల్లో దేశ వ్యాప్తంగా 14 మంది విద్యార్థులు 100 పర్సంటేజ్ సాధించారు. వారిలో ఐదుగురు రాజస్థాన్ విద్యార్థులు కాగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన సాయి మనోఘ్న గుత్తికొండ విద్యార్థిని 100శాతం ఉత్తీర్ణతతో టాపర్‌గా నిలిచారు. ప్రతిష్టాత్మక ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్లలో బీటెక్ చేసేందుకు, అదే విధంగా ఐఐటీల్లో బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు అర్హత పరీక్షగా ఎన్‌టీఏ ఏటా రెండుసార్లు జేఈఈ-మెయిన్ పరీక్షలు నిర్వహిస్తోంది. మొదటి దఫా పరీక్షకు జాతీయ స్థాయిలో 13.8 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో దాదాపు 2 లక్షల మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉంటారని అంచనా.



**300 మార్కులకు పరీక్ష**

మూడు సబ్జెక్ట్‌లలో 300 మార్కులకు పరీక్ష నిర్వహించారు. మ్యాథమెటిక్స్ నుంచి 25, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం 75 ప్రశ్నలతో ఒక్కో ప్రశ్నకు 4 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహించారు. కాగా ప్రశ్నల క్లిష్టత స్థాయి ఓ మోస్తరుగా ఉందని, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, గత ప్రశ్న పత్రాలు సాధన చేసిన వారికి కొంత మేలు కలిగించేదిగా ఉందని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు. రెండు సెషన్లలోనూ మ్యాథమెటిక్స్ విభాగం ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నప్పటికీ.. ప్రశ్నలు సుదీర్ఘంగా ఉండడంతో కొందరు విద్యార్థులకు జవాబులిచ్చేందుకు సమయం సరిపోలేదు. ఫిజిక్స్ విభాగం ప్రశ్నలు సులభంగా, కెమిస్ట్రీలో కొన్ని సులభంగా, కొన్ని ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 50 శాతం ప్రశ్నలు చాలా సులభంగా ఉండడం విద్యార్థులకు ఉపశమనం కలిగించింది. ఈ రెండు విభాగాల ప్రశ్నలకు అభ్యర్థులు 45 నిమిషాల చొప్పున సమయంలో జవాబులు ఇవ్వగలిగారు. అయితే మిగతా గంటన్నర సమయంలో మ్యాథమెటిక్స్‌లో 15 నుంచి 20 ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇవ్వగలిగినట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. ప్రశ్నలు చాలా సుదీర్ఘంగా ఉండడమే ఇందుకు కారణంగా సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే కెమిస్ట్రీ ప్రశ్నలు.

తొలిరోజు రెండు సెషన్లలోనూ ప్రశ్నలు జేఈఈ%-%మెయిన్ గత ప్రశ్నపత్రాల నుంచే ఎక్కువగా అడిగారు. ముఖ్యంగా 2021, 2022 ప్రశ్నలకు సరిపోలే విధంగా చాలా ప్రశ్నలు ఉన్నట్లు నిపుణులు తెలిపారు. ఇక కెమిస్ట్రీలో అధిక శాతం ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే.. డైరెక్ట్ కొశ్చన్స్‌గా అడగడంతో ప్రాక్టీస్ చేసిన వారికి ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉంది. ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి 35 శాతం, ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి 35 శాతం, ఇన్%-%ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి 30 శాతం ప్రశ్నలున్నాయి. కెమికల్ బాండింగ్, బయో మాలిక్యూల్స్, మోల్ కాన్సెప్ట్, కాటలిస్ట్స్, వేవ్ లెంగ్త్, ఎస్‌ఎంఆర్, పొటెన్షియల్ మీటర్, కెమికల్ ఈక్వేషన్ ఎనర్జీ, రేడియో యాక్టివ్ డికే, ఆర్గానిక్ కెమిస్ట్రీ (3 ప్రశ్నలు), కో ఆర్డినేట్ కాంపౌండ్, ఆక్సిడేషన్ స్టేట్‌ల నుంచి ప్రశ్నలు వచ్చాయి.

**ఫిజిక్స్, మ్యాథ్స్‌లో ఇలా..**

ఫిజిక్స్‌లో థర్మోడైనమిక్స్, ప్రొజెక్టైల్ మోషన్, ఎలక్ట్రిక్ సర్క్యూట్, డయోడ్స్, ఈఎం వేవ్స్, మోడ్రన్ ఫిజిక్స్, రే ఆప్టిక్స్, సెమీ కండక్టర్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఏసీ సర్క్యూట్, డైమెన్షనల్ ఫార్ములా, ఫోర్స్, మూమెంట్ ఆఫ్ ఇనెర్షియా ఆఫ్ స్పియర్ నుంచి ప్రశ్నలు అడిగారు. మ్యాథ్స్‌లో స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, సింపుల్ ప్రాబ్లమ్, వెక్టార్, 3డి జామెట్రీ, షార్టెస్ట్ డిస్టెన్స్ ప్రాబ్లమ్, మాట్రిసెస్, డిటర్మినెంట్స్, బయనామియల్ థీమర్, ట్రిగ్నోమెట్రీ, క్వాడ్రాట్రిక్ ప్రొడక్ట్ ఆఫ్ ఆల్ సొల్యూషన్స్, సిరీస్, పారాబోలా, ఏరియా ఆఫ్ సర్కిల్, పెర్ముటేషన్, హైపర్ బోలా, డిఫరెన్షియల్ ఈక్వేషన్, సర్కిల్ ఇంటర్‌సెక్టింగ్ ప్రాబ్లమ్స్ అడిగారు.

**అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ అంచనా ఇలా..**

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే.. జనరల్ కేటగిరీలో 91%-%92 మార్కులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 79%-%80, ఓబీసీ కేటగిరీలో 77%-%78, ఎస్సీ కేటగిరీలో 56%-%58, ఎస్‌టీ కేటగిరీలో 42%-%44 మార్కులు కటాఫ్‌గా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు

## ఈవీఎంల్లో డేటాను డిలీట్ చేయవద్దు



**న్యూఢిల్లీ:** ఎన్నికల ప్రక్రియ ముగిసి ఫలితాలు వచ్చిన తర్వాత ఈవీఎంల్లో నిక్షిప్తమై ఉన్న డేటాను డిలీట్ చేయవద్దని ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈవీఎంల్లో నిక్షిప్తమైన డేటాపై అనుమానాలు వ్యక్తం చేస్తూ హరియాణా రాష్ట్ర అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్, కాంగ్రెస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. డేటా డిలీట్ చేసే ప్రక్రియనుబ చేపట్టవద్దని ఎన్నికల కమిషన్‌కు ఆదేశించింది. ఎన్నికల పూర్తియిన తర్వాత ఈవీఎంలకు సంబంధించి ఎలాంటి నిర్ణీత ప్రమాణాలు పాటిస్తున్నారో చెప్పాలని ఈసీకి స్పష్టం చేసింది. 'ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిపోయిందని భావించి ఈవీఎంల్లో ఉన్న డేటా తొలగించకండి. ఏవిధమైన డేటాను ఈవీఎంల నుంచి తొలగించవద్దు. అదే సమయంలో ఏ తరహా డేటాను అందులో రీలోడ్ చేయవద్దు' అని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల కమిషన్ అనేది డేటా అవసరమైన పక్షంలో కోర్టుకు సమర్పించాల్సి ఉండటంతో డేటా తొలిగించే ప్రక్రియ జరిగితే దాని వల్ల సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశాలు ఉన్నాయని గ్రహించాలని పేర్కొంది. ఒకవేళ ఓటమి పాలైన అభ్యర్థి వివరణ కోరిన పక్షంలో ఈవీఎంల్లో ఎటువంటి ట్యాంపరింగ్ జరగలేదనే విషయాన్ని ఒక ఇంజనీర్ సాయంతో ధృవీకరించాల్సి ఉంటుందన్నారు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా. అదే సమయంలో ఈవీఎంల్లోని మైక్రో కంట్రోలర్, మెమొరీల్లో ఉన్న డేటాను తొలగించే ముందు ఏ విధానం అమలు చేస్తున్నారో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ పిటిషన్‌ట్కు విచారణను మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది సుప్రీంకోర్టు.

## జమ్మూకశ్మీర్‌లో ఐఈడీ పేలుడు..
## ఇద్దరు సైనికుల మృతి



ఇంటర్నెట్ డెస్క్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు అమర్చిన ఐఈడీ బాంబు పేలడంతో ఇద్దరు సైనికులు మృతి చెందగా మరో సైనికుడు గాయాలపాలయ్యారు. అఖనూర్ సెక్టర్‌లో మంగళవారం సైనికదళాలు సరిహద్దు వెంబడి గస్తీ నిర్వహిస్తుండగా మధ్యాహ్నం 3.30 సమయంలో ఈ బాంబు పేలినట్టు ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది. పేలుడుతో తీవ్ర గాయాల పాలైన సైనికులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఓ కెప్టెన్, మరో సైనికుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో సైనికుడిని చికిత్స నిమిత్తం గగన మార్గంలో ఆర్మీ ఆసుపత్రికి తరలించామని, అతడికి ప్రాణాపాయం తప్పిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మరో వైపు ఘటన తరువాత సైన్యం ఆ ప్రాంతంలో అదనపు దళాలను మోహరించింది. ఎల్‌ఓసీ వెంబడి తనిఖీలను ముమ్మరం చేసింది. పేలుడు ఘటన గురించి జమ్మూలోని వైట్ నైట్ కోర్ యూనిట్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సైనికులకు వందనాలు అర్పిస్తున్నామని పేర్కొంది. కాగా, రెండు రోజుల క్రితం ఖేరీ సెక్టర్‌లో ఎల్‌ఓసీ వెంబడి ఉన్న అటవీ ప్రాంతంలో దాగున్న ఉగ్రవాదులు ఆర్మీ గస్తీ దళంపై కాల్పులకు తెగబడ్డారు. సరిహద్దు దాటి దేశంలోకి అక్రమంగా చొరబడేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో ఆర్మీ ఎదురుపడటంతో వారు కాల్పులకు దిగారు. దీంతో, భారత సైనికులు కూడా ఎదురు దాడి చేశారు. ఆ తరువాత చొరబాట్ల నిలవరించే చర్యలను సైన్యం మరింత కట్టుదిట్టం చేసింది. గస్తీని తీవ్రతరం చేసింది.

## పంజాబ్ సీఎంను మార్చేయబోతున్నారా?



**న్యూఢిల్లీ:** ఢిల్లీ ఫలితం నేపథ్యంలో.. పొరుగున్న ఉన్న పంజాబ్ ముఖ్యమంత్రిని అక్కడి అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ మార్చేయబోతోందంటూ ప్రచారం నడుస్తోంది. ప్రస్తుత సీఎం భగవంత్ మాన్ విషయంలో ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద కేజ్రీవాల్ అసంతృప్తిగా ఉన్నారని, హామీల అమలులో మాన్ ఘోరంగా విఫలమయ్యారని, త్వరలో ఆయన్ని తప్పించి సమర్థుడిని ఎంపిక చేయబోతున్నారన్నది ఆ ప్రచార సారాంశం. దీనిపై పంజాబ్ సీఎం మాన్ స్పందించారు. ఢిల్లీలో ఇవాళ పంజాబ్ ఆప్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, ఇతర ముఖ్యనేతలు హాజరయ్యారు. ఆ మీటింగ్ తర్వాత.. ఢిల్లీ బీజేపీ ఎమ్మెల్యే(నూతన) మజిందర్ సింగ్ సిర్సా చేసిన కామెంట్ల గురించి మాన్‌కు మీడియా నుంచి ప్రశ్నెదురైంది. దానికి ఆయన గట్టిగా నవ్వారు. వాళ్లను అలా మాట్లాడనివ్వండి అని మీడియాతో చెప్పారు. పంజాబ్ ఆప్‌లో ఎలాంటి మార్పు ఉండబోదు. ఢిల్లీ ఫలితాల తర్వాత పంజాబ్ యూనిట్ మా పార్టీ కన్వీనర్‌ను కలవాలనుకుంది. అందుకే వచ్చాం. ఇవాల్టి మీటింగ్‌లో అలాంటి అంశం కూడా ఏదీ చర్చకు రాలేదు. పంజాబ్‌లో మా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంది. ప్రత్యర్థులు ఎన్ని రకాల ప్రచారాలు చేసినా.. మాకొచ్చిన నష్టమేమీ లేదు అని అన్నారాయన. అదే సమయంలో.. తనతో ఇరవై మంది పంజాబ్ ఆప్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారంటూ కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బజ్వా చేసిన వ్యాఖ్యలపైనా మాన్ స్పందించారు. "ఆయన గత మూడేళ్లుగా ఆ మాటే చెబుతూ వస్తున్నారు. ఆ లెక్కలో ఎలాంటి మార్పు రావడం లేదు. ఒకసారి మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో.. ఆ పార్టీ ఎన్ని సీట్లు నెగ్గిందో ఆయన్ని లెక్కించుకోమనండి" అంటూ ఎద్దేశా చేశారాయన. అలాగే.. ఎన్నికల హామీలను పంజాబ్ ఆప్ ప్రభుత్వం విస్మరిస్తోందన్న విమర్శలపైనా మాన్ స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లో హామీలను అమలు చేసి తీరతామని ఉద్ఘాటించారాయన. ఇదిలా ఉంటే.. 117 మంది సభ్యులున్న పంజాబ్ అసెంబ్లీలో 93 మంది ఆప్ సభ్యులు ఉండగా, 16 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు.

# రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు!?

**హైదరాబాద్ :** తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేల స్టోరీ క్లైమాక్స్‌కు చేరినట్లే కనిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి.. కాంగ్రెస్ గూటికి చేరిన జంపింగ్ ఎమ్మెల్యేలపై న్యాయ పోరాటం చేస్తోంది కారు పార్టీ. అందులో భాగంగానే సుప్రీంకోర్టులో వరుస విచారణలు జరుగుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ టైమ్ కావాలంటూ గడువు కోరడంతో ఇప్పటికే ఓసారి సీరియస్ అయింది. రీజనబుల్ టైమ్‌పై మరోసారి అసెంబ్లీ స్పీకర్‌పై ప్రశ్నలు కురిపించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారి ఇప్పటికే పది నెలలు పూర్తయ్యింది. అయినా స్పీకర్ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో..పది నెలల సమయం రీజనబుల్ టైమ్ కాదా అని క్వశ్చన్ చేసింది సుప్రీంకోర్టు. ఆ తర్వాత మిగతా విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ క్రమంలో 18న జరగబోయే వాదనలపై ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ మాత్రం నెక్స్ట్ హియరింగ్‌లో సుప్రీంకోర్టు ఫైనల్ జడ్జిమెంట్ ఇస్తుందని భావిస్తోంది. ఆ పది మంది ఎమ్మెల్యేలపై వేటు పక్కా.. ఉప ఎన్నికలు కూడా ఖాయం అంటూ ధీమాతో ఉంది. చట్ట ప్రకారం స్పీకర్ నిర్ణయాధికారానికి కాల పరిమితి లేదు. అందుకే ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెడుతూ వస్తున్నారు స్పీకర్. అయితే గతంలో సుప్రీంకోర్టు జోక్యంతో చాలా రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు తెలంగాణలోనూ ఇదే రిపీట్ కాబోతోందా అన్న చర్చ సాగుతోంది. అటు ఫిరాయింపుదారులపై వేటు పడుతుందని.. ఉప ఎన్నికలకు రెడీగా ఉండాలంటూ క్యాడర్‌కు ఇప్పటికే పిలుపునిచ్చారు. మాజీమంత్రి కడియం శ్రీహరి లేటెస్ట్ కామెంట్స్ చూస్తే..ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా ఉప ఎన్నికలకు మానసికంగా సిద్ధమవుతున్నట్లే కనిపిస్తోంది. దీంతో పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తారా..లేక సుప్రీంకోర్టు నిర్ణయం కోసం వేచి చూస్తారా అన్నది ఆసక్తి రేపుతోందిబీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలని గులాబీ పార్టీ వరుస పిటిషన్లు దాఖలు చేసింది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు వివేకానంద గౌడ దాఖలు చేసిన రెండు పిటిషన్లతో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఒక పిటిషన్ దాఖలు చేశారు. గతంలో పాడి కౌశిక్ రెడ్డి, వివేకా కలిసి పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలపై పిటిషన్ వేయగా.. మరో ఏడుగురి పేర్లను జత చేసి కేటీఆర్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ఆ రెండు పిటిషన్లను జత చేసి సుప్రీంకోర్టు విచారిస్తోంది.అయితే స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించే అవకాశం ఉందా..అందుకు రాజ్యాంగం నిబంధనలు ఒప్పుకుంటాయా అన్నదే చర్చనీయాంశం అవుతోంది. నిర్ణీత సమయంలో అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానాలు ఆదేశించవచ్చా? లేదా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలు న్నాయి. గతంలో మణిపూర్ ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన కేసులో 4 వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. మహారాష్ట్ర ఎమ్మెల్యేల కేసులో మాత్రం అనర్హత పిటిషన్లపై స్పీకర్ లిమిటెడ్ సమయంలో నిర్ణయం తీసుకోవాలని సూచించిందే తప్ప నిర్దిష్ట ఆదేశాలేమి ఇవ్వలేదు.ఇక, మరో కేసులో అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే బాధ్యతలు స్పీకర్‌కు అప్పగించాలా? లేదా? అన్న విషయంపై పార్లమెంటే పునరాలోచించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇలా వివిధ కేసుల్లో సుప్రీంకోర్టు వేర్వేరు అభిప్రాయాలు, తీర్పులు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ ఎమ్మెల్యేల కేసు విషయంలో ఎలాంటి ఆదేశాలు వెలువడుతాయోనన్న చర్చ సాగుతోంది.గులాబీ నేతలు అయితే పది స్థానాలకు ఉప ఎన్నికలు ఖాయమన్న భావనలో ఉన్నారు. కేసీఆర్ కూడా ఉపఎన్నికలు ఖాయమని డిసైడ్ అయ్యారట. అందుకే త్వరలో ప్రజాక్షేత్రంలోకి రావాలని భావిస్తున్నట్లు టాక్. ఈ నెలాఖరులోగా బహిరంగ సభకు కూడా ప్లాన్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని జహీరాబాద్ కార్యకర్తల భేటీలో చెప్పారు గులాబీ బాస్. అంతేకాదు కామారెడ్డి వేదికగా బీసీ బహిరంగ సభ పెట్టి..ఆ తర్వాత వరుస సభలు, సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారట. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికలు వస్తే ఫలితాలు తమకే అనుకూలమని అంచనా వేస్తున్నారట గులాబీ నేతలు. అందుకే బైపోల్స్‌కు సై అంటున్నారు. గతంలో ఉప ఎన్నికల వచ్చినప్పుడు తాము గెలిచిన సందర్భాలను గుర్తు చేస్తున్నారు.రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ స్కీమ్‌ల అమలుపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని బీఆర్ఎస్ లెక్కలు వేసుకుంటోంది. కాంగ్రెస్ మాత్రం బైపోల్స్ ఎందుకు వస్తాయంటోంది. అయితే లీగల్ అంశాలతో పాటు స్పీకర్‌కు ఉన్న అధికారాలను బేస్ చేసుకుని ఉప ఎన్నికలు రావని రేవంత్ సర్కార్ ధీమాగా ఉన్నట్లు తెలుస్తోంది.ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పరిశీలించిన కాంగ్రెస్ పెద్దలు.. బై ఎలక్షన్స్ అన్న ముచ్చటే ఉండదని భావిస్తున్నారట. చూడాలి మరి బీఆర్ఎస్ ఆశించినట్లు ఉపఎన్నికలు రాబోతున్నాయా? లేక కాంగ్రెస్ ధీమాకు తగ్గట్లు సుప్రీం ఆదేశాలు ఉండే అవకాశం ఉందా అన్నది చూడాలి.

# ఎస్సీలకు న్యాయం చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

యార్యన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేశారన్నారు.

ఎస్సీ బీ వర్గీకరణ రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయన్నారు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ. దీనిలో భాగంగానే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో సమావేశమైనట్లు మందకృష్ణ తెలిపారు. సీఎం రేవంత్‌తో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసినట్లు మీడియాకు తెలిపారు..

'గత మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతుంది. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీ లో తీర్మానం చేసిన సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు. వర్గీకరణను స్వాగతిస్తున్నాం...కానీ వర్గీకరణ, రిజర్వేషన్లలో కొన్ని లోపాలు ఉన్నాయి. వెనకబడిన కులాలను ఏ గ్రూప్ లో కలపాలి అనేదానిపై సీఎం రేవంత్‌తో చర్చించాం. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను ఏ,బీ,సీలుగా వర్గీకరణ చేసింది. దీనివల్ల కొన్ని కులాలకు అన్యాయం జరుగుతోంది.



ఎస్సీలలో అత్యధికంగా మాదిగలు ఉన్నారు.ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వం ఆమోదించిన నివేదికలో లోపాలను సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలని కోరుతున్నాం.కొన్ని కులాలు జనాభా లేక పోయినా వారిని మొదటి గ్రూప్‌లో ఒక శాతం రిజర్వేషన్ల ఇచ్చారు. వెనకబడిన మాదిగ కులానికి రిజర్వేషన్లు అన్యాయం జరిగింది. ఎక్కువ జనాభా ఉన్న నేతకానీలను మాలలు ఉన్న సి గ్రూప్ లో వేయడంతో వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న మాదిగలే మాలలతోని తట్టుకోలేక పోయారు. ఎక్కువ జనాభా ఉన్న బేడ బుడగ జంగాలను అత్యధికంగా వెనుకబడిన 'ఏ' గ్రూపులో వేశారు. అధిక జనాభా ఉన్న మాదిగలకు గ్రూప్ బీ లో 9 శాతం రిజర్వేషన్ల ఇచ్చారు. దాన్ని 11 శాతానికి పెంచాలని సీఎంను కోరాం. ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా తమ పోరాటం కొనసాగుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాదిగలకు న్యాయం చేసేలా జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను ఆలస్యం చేయకుండా ఆమోదించారని ఆయన అన్నారు. రిజర్వేషన్ శాతం విషయంలో మాత్రం కొన్ని లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. కులాల చేర్పులు, మార్పుల్లో లోటుపాట్లపై వినతిపత్రం అందించినట్లు మంద కృష్ణ మాదిగ తెలిపారు. తాము మొదటి నుండి ఏబీసీడీ వర్గీకరణ కోసమే పోరాటం చేస్తున్నామని ఆయన అన్నారు. ఎస్సీ వర్గీకరణను 4 గ్రూపులుగా చేయాలని కోరినట్లు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీ గ్రూపులో ఉన్న వర్గాన్ని మొదటి గ్రూపులో చేర్చారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణలోని లోటుపాట్లను ముఖ్యమంత్రి సరిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన మాలలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్ కేటాయించారు.గతంలో బి అండ్ సి గ్రూప్ లో ఉన్న మన్నే కొలుపులవాండ్లు పంబాడ, పంబాల, పంపండ కులాలను గ్రూప్ సి లో ఉంచాలి.ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి విజ్ఞప్తులు చెప్పాం. ఎస్సీ వర్గీకరణలో అన్ని కులాలకు న్యాయం జరగాలన్నదే మా లక్ష్యం.డిప్యూటీ సీఎం మల్లు భట్టి 'విక్రమార్కను కూడా కలుస్తాం' అని మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు.

# మంత్రి ఇలాకాలోనే భారీగా వసూలు!

**మహబూబ్ నగర్ :** రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న నాగర్ కర్నూల్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ అమ్యామ్యా లకు అలవాటు పడిందని ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఏ చిన్న పని జరగాలన్నా భారీ స్థాయిలో ముడుపులు ముట్ట చెప్ప నిదే పనులు జరిగే పరిస్థితి లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.గౌడ సామాజిక వర్గం కుటుంబీకులు తమ వృత్తిని కొనసాగిం చడం కోసం కల్లుగీత కార్మికులుగా గుర్తింపు కోసం కోపరేటివ్ సొసైటీ, టిఎఫ్ టి లైసె న్సులు పొందాలంటే లక్షలు ముట్ట చెప్పాల్సి న పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టు ఎక్కగలిగే గీత కార్మికునికి సైతం లైసెన్స్ లు ఇచ్చేందుకు ఆప్కారి శాఖ అధికారులు అవినీతి సొమ్ముకు కక్కుర్తి పడు తున్నారు. ఆయా సర్కిల్ స్టేషన్ పరిధిలోని కిందిస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికా రుల వరకు ఒకే రకమైన దోపిడీకి అలవాటు పడ్డట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.ఈ ముడుపులన్నీ మంత్రులకు వాటాల పేరుతో నే దబాయించి వసూలు చేస్తున్నట్లు ఆరోప ణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో టిఎఫ్టి లైసెన్స్ కోసం సుమారు లక్షల నుంచి రెండు లక్షల దాకా వసూళ్లు చేస్తున్నారు. దీంతోపా టు సందర్భాన్ని బట్టి దావత్ కూడా ఇవ్వా ల్సిందే నని బాధితులు వాపోతున్నారు. అరత ఉన్నప్పటికీ లైసెన్సులు పొందే పరి స్థితి లేకపోవడంతో నిరుపేద కల్లుగీత కార్మి కులు మనోవేదనకు గురవుతున్నారు.ము డుపులు ఇచ్చిన వారికి మాత్రం అధికారి ఫీల్డ్ లోకి వెళ్లకుండా వారి స్థానంలో అధికా రి హోదాలో ఓ ఫోటోగ్రాఫర్ ను పంపి స్వ యంగా చెట్టెక్కినట్లు సృష్టించి ఫోటోలు ఆధారంగా చూపి లైసెన్సులను ముట్ట చెబుతున్నట్లు ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. దీంతో అరత లేని లైసెన్స్ దారులు విషపూరితమైన మత్తు పదార్థాలు వినియోగించి కృత్రిమంగా కల్తీ కళ్ళు తయా రుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడు తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వా త ఈ దోపిడీ మరింత పెరిగిందని ఆయా గ్రామాల గౌడ సామాజిక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఐదు సర్కిల్ ఎక్సుజ్ పోలీస్ స్టేషన్లో ఉండగా జిల్లావ్యాప్తంగా టిఎఫ్టి లైసెన్స్ పొందిన వారు 221, టిసిఎస్ కో-ఆపరేటివ్ సొసైటీలు 59 ఉన్నాయి. గౌడ సామాజిక



వర్గంలోని నిరుద్యోగులు చెట్టు ఎక్కి కళ్ళు గీసే వృత్తిని ఎంచుకొని ఆ ప్రతిభ ఉన్నవారికి ప్రభుత్వం టిఎఫ్టి, టిసిఎస్ లైసెన్సులు సాధారణ డిడి రూపంలో మాత్ర మే తీసుకోవాల్సి ఉంది.కానీ ఆయా సర్కిల్ పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు అడ్డగో లుగా వారి నుంచి ముడుపులు ఆశిస్తున్నా రని తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరి కొందరిలో అరత లేకపోయినా ముడుపు లందుకొని నిబంధనలకు విరుద్ధంగా వారికి లైసెన్సులు ఇస్తున్నట్లు అరత గల గౌడ సామాజిక వర్గం నేతలు ఆరోపిస్తు న్నారు. రాష్ట్ర ఎక్సుజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న నాగర్క ర్నూల్ జిల్లాలో ఏ స్టేషన్లో చూసిన ఆప్కారి శాఖ అధికారులు ముడుపులు ముట్ట చెప్పం డి పని చేయడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ముడుపులమ్మ వాటా లు ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులకు వెళ్తాయని బాహాటంగానే చెప్పుకుంటున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.ఈ వ్యవ హారం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మరింత పెచ్చుమెరిపోయిందని తద్వారా కల్తీకల్లు మాఫియా మరింత పెరుగుతుందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిల్ దాఖలు

**ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన ఏపీడబ్ల్యూఎఫ్**

**తెలంగాణ సీఎస్ సహా పలువురిని ప్రతివాదులుగా చేర్చిన వైనం**

**చారిత్రక కట్టడాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి**

పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై అభ్యంతరం తెలుపుతూ ఏపీడబ్ల్యూఎఫ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. ఈ పిటిషన్‌లో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), వక్ఫ్ బోర్డు సీఈవోలను ప్రతివాదులుగా పేర్కొంది. పాతబస్తీలో పలు చారిత్రక కట్టడాలు ఉన్నందున, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం సరికాదని పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. తెలంగాణ హెరిటేజ్ యాక్ట్-2017 ప్రకారం చారిత్రక కట్టడాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఆ పిల్‌లో పేర్కొంది. పాతబస్తీ మెట్రో మార్గం సమీపంలోనే చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురానా హవేలీ, మొఘుల్‌పురా వంటి చారిత్రక కట్టడాలు ఉన్నాయని తెలిపింది. మెట్రో రైలు నిర్మాణం వల్ల ఈ చారిత్రక కట్టడాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. అందుకే, మెట్రో రైలు డిజైన్‌ను హైకోర్టు లేదా నిపుణుల బృందం ఆమోదించిన తర్వాతే ముందుకు వెళ్లాలని, అప్పటి వరకు మెట్రో నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరింది. ఈ పిల్‌పై విచారణను హైకోర్టు ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది.

## మా పోరాటం ఆగదు



**సిద్దిపేట:** రైతుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుల కోసం తాము నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. ఇవాళ(మంగళవారం) సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువను పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు. అనంతరం స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలోని పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) తోటలను సందర్శించి, అక్కడి రైతులతో ముఖాముఖిలో చర్చించారు. రైతులు మార్కెటింగ్ సమస్యలను, పంటకు సరైన ధర లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, తక్షణమే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సన్‌ఫ్లవర్ పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హరీష్ రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలని అన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడం వల్లే ఇప్పుడు పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని చెప్పారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఈ ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని, ఇది కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని హరీష్‌రావు గుర్తు చేశారు.


## రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు



**వరంగల్:** రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు అయ్యింది. ఛత్తీస్‌గఢ్ మావోయిస్టుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో భద్రతా పరమైన ఇబ్బందులు కారణంగా రాహుల్ పర్యటన రద్దు అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, షెడ్యూల్ ప్రకారం ఇవాళ సాయంత్రం 5.30 గంటలకు రాహుల్ శంషాబాద్ చేరుకుని అక్కడ నుంచి చాపర్‌లో వరంగల్ చేరుకోవాల్సి ఉంది. వరంగల్ సుప్రభా హోటల్‌లో కాసేపు విశ్రాంతి తీసుకుని 7:30కి వరంగల్ నుంచి రైలులో చెన్నై వెళ్లాల్సి ఉంది. బీసీ కుల గణన అంశంలో ప్రజల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో.. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రజల స్పందనను రాహుల్ తెలుసుకోవడంతో పాటు, రైల్వే ప్రైవేటీకరణ అంశంపై రైలు ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సేకరించాల్సి ఉంది.. అయితే, భద్రతపరమైన ఇబ్బందులు కారణంగా చివరి క్షణంలో పర్యటన రద్దు అయ్యింది.

## చెల్లెల్ని చూసి నేర్చుకో

-మొదటిపేజీ తరువాయి



రెవెన్యూ నుంచి ఉద్యోగులను తీసుకోవడం ఇప్పుడు కొత్తేమీ కాదు. లీగల్ లిటికేషన్స్‌లో లేని వాటిని మొదటి దశలో సర్వే చేయాలని అదేశించాం. రాష్ట్రంలో ఎక్కడెక్కడ కుంభాభిషేకాలు చేయాలో లిస్ట్ సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చాం. కాళేశ్వరంలో కుంభాభిషేకం చేయక 42 ఏళ్లు అవుతుంది. ఫారెస్ట్‌లలో సర్వేయర్ల ప్రొటెక్షన్‌పై ఎలాంటి ఫిర్యాదులు లేవు. గత పదేళ్ళలో దేవాదాయ శాఖ భూములు కబ్జా అయ్యాయి. గత ప్రభుత్వంలో నాయకులే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈటెల రాజేందర్‌పై త్వరలోనే విచారణ జరుగుతుంది. బీసీ రిజర్వేషన్ల సర్వేతో మాకు పేరు వస్తుందనే విమర్శలు. బీసీ రిజర్వేషన్ల వ్యాల్యూ ఇప్పుడే అర్థం కాదు. ఉద్యోగాలు,ఇతర అంశాల్లో బీసీలకు న్యాయం జరుగుతుంది' అని హామీ ఇచ్చారు.

## తెలంగాణ వ్యాప్తంగా ఆగిన పత్తి కొనుగోళ్లు.. రైతులు ఆగ్రహం



**వరంగల్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు ఒక్కసారిగా ఆగిపోయాయి. గత రెండోరోజులుగా సీసీఐ(కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా) సర్వర్ పని చేయడం లేదని పత్తి కొనుగోళ్లు నిలిపివేశారు తెలంగాణ రాష్ట్రంలో. దాంతో మార్కెట్ యార్డులలో వేల ట్రాక్టర్లు నిలిచిపోయాయి. దీనిపై పత్తి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ డౌన్ అంటూ సాకులు చెబుతున్నారని మండిపడుతున్నారు. ప్రైవేట/ వ్యాపారులకు లాభం చేకూర్చేందుకు సర్వర్ డౌన్ పేరుతో పత్తి కొనుగోలు ఆపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబందంధి ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## పేదల్ని కొట్టే బడ్జెట్


ఈనెల 1న కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి 2025-26 సంవత్సరానికిగాను రూ.50,65,345 లక్షల కోట్లతో పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు.గంటా పదిహేను నిమిషాల సాగిన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖా మంత్రి నాలుగుసార్లకు పైగా బీహార్ రాష్ట్రానికి సంబంధించిన కేటాయింపుల గురించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక్క మాట లేకపోగా, కేటాయింపులూ అరకొరే. వివిధ శాఖలకు కేటాయింపులు రూ.లక్షల కోట్లల్లో ప్రవేశపెట్టబడినా, వాస్తవ ఖర్చులు 26శాతం నుండి 46 శాతం వరకే. అధిక ధరలతో ప్రజల జీవనవ్యయం పెరిగిపోతూ ఉండగా, వీటిని తగ్గించడానికి ఏ రకమైన చర్యలు లేవు. వ్యవసాయ రంగానికి సంబంధించిన కేటాయింపులు రైతుల అవసరాలకు తగ్గట్టుగా లేకపోగా, ఎరువుల ధరల సబ్సిడీలను తగ్గించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరల గురించి రైతులు నిరంతరం పోరాటం చేస్తున్నప్పటికీ ఈ విషయంలో నిర్దిష్టమైన చర్యలు లేకపోవడం విచారకరం. ఇదిలా ఉంటే దేశ అప్పు రూ.181లక్షల కోట్లకు చేరింది. ఇంకా విదేశీ రుణాలు మరో రూ.6లక్షల కోట్ల వరకు ఉంటాయి. ఈ బడ్జెట్‌లో రూ.12,76,338 లక్షల కోట్లు తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లింపులకే కేటాయించారు. ఇది సుమారు మూడు,నాలుగు రాష్ట్రాల బడ్జెట్‌తో సమానంగా ఉంటుంది! అంటే, వడ్డీలకే ఇంత బడ్జెట్‌ను కేటాయింస్తే అసలు చెల్లించడానికి ఎన్ని దశాబ్దాలు కావాలి? ఇదంతా ఎక్కడినుంచి తెస్తారు? దేశ ప్రజలపై భారాలు వేసే కదా! ఇది పౌర సమాజం ఆలోచించాలి. ప్రజల కనీస అవసరాలైన ఇండ్లు, విద్య, వైద్యం విషయంలో ప్రయివేటు రంగానికి పెద్దపీట వేస్తూ తీసుకుంటున్న చర్యలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. పన్నుల భారాలు ప్రజల జీవితాలకు గుదిబండలా మారాయి. జీఎస్‌టీ ప్రవేశపెట్టినప్పుడు నెలకు రూ. 60వేల కోట్లుగా ఉన్న పన్నులు, గత నెల రూ.1,92,000 కోట్లకు చేరుకున్నాయి. కనపడిన ప్రతి వస్తువుపై జీఎస్‌టీ పేరుతో పన్నులు విధించడం బ్రిటీష్ కాలంనాటి పన్నుల విధానాన్ని గుర్తుకు తెస్తున్నాయి. ఆనాడు మహిళలు రవికలు వేసుకోవాలన్నా పన్ను, అడవిలో కట్టెలు కొట్టుకోవాలన్నా పన్ను, ఉప్పుపై పన్ను, ఈ విధంగా కనపడిన ప్రతిదానిపై పన్నులు విధిస్తే, ఆ రోజు ప్రజలు పన్నుల భారాలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడి, విజయాలు సాధించుకుని బ్రిటీష్ ప్రభుత్వాన్ని దేశం నుండి వెళ్లగొట్టిన చరిత్ర భారతీయులది. నేడు పసి పిల్లలు తాగే పాల ప్యాకెట్లపై ప్రాథమిక దశలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పెన్సిల్, రబ్బర్‌పై కూడా పన్నులు వేస్తూ అనాగరికంగా ప్రవర్తిస్తున్న పరిస్థితి నేడు ఉన్నది. లక్షలాదిగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసే విషయం ఆలోచించకుండా, నిరుద్యోగులు ఉద్యోగాలకై చేసే దరఖాస్తులపై కూడా పన్నులు విధించడం దారుణం. గత పదేండ్లలో ఐదు కోట్లకు పైగా పేదలకు గృహాలు నిర్మించి ఇచ్చినట్లుగా చెపుతున్న కేంద్రం రాబోయే రోజుల్లో మరో కోటికి పైగా గృహాలను నిర్మిస్తామని తెలియజేసింది. కానీ వాస్తవంలో పేద ప్రజల ఇండ్ల నిర్మాణానికి ప్రతి గృహానికి కేంద్రం తరపున పట్టణాల్లో రూ.లక్షా 50వేలు, గ్రామాల్లో రూ.75వేలు మాత్రమే కేటాయిస్తున్నది. మిగతా ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తున్నాయి. కానీ మధ్య తరగతి స్వంతంగా ఇల్లు నిర్మించుకోవాలంటే సిమెంట్‌పై 28 శాతం, ఇనుముపై 18 శాతం, ఇంటికి సంబంధించిన పింగాణి సామాగ్రి, ఇతర వస్తువులపై 18 శాతం జీఎస్‌టీ రూపేణా వసూలు చేస్తున్నది. అపార్ట్ మెంట్లల్లో ఫ్లాట్ కొనుక్కోవాలన్నా రిజిస్ట్రేషన్ సందర్భంగా జీఎస్‌టీ వసూళ్లు చేస్తున్నది. ఇది మధ్య తరగతి స్వంత ఇండ్ల కలను నీరుగార్చేదిగా ఉన్నది. సినిమా హాల్లో చిన్నపిల్లలు, పెద్దలు విరామ సమయంలో ఇష్టంగా తినే పాప్‌కార్న్‌పై మూడు రకాల జీఎస్‌టీలను విధించడం ఈ మధ్యనే చూసాము. కార్మికులు తమ నిజ వేతనాలు కోల్పోతూ, పిల్లల విద్య, వైద్యం, ఇతర ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతూ జీవితాలు దుర్భరంగా గడుపుతున్న పరిస్థితులు నేడు నెలకొన్నాయి. వారు తమ వేతనాలు నెలకు కనీసంగా రూ.26వేలు చేయాలని చేస్తున్న డిమాండ్లు పరిష్క రించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పట్టణ ప్రాంతాల అభివృద్ధి పేరుతో 500లకు పైగా స్మార్ట్ సిటీలు, 100కు పైగా అమృత్ సిటీలను ప్రకటించి వాటి అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు ఏమీ చేయలేదు. గతేడాది పట్టణాభివృద్ధికి రూ.82,577 కోట్లు ప్రక టించగా, ఈ ఏడాది అతి కొద్ది మొత్తం పెంచి రూ.96,777 కోట్లు కేటాయించారు. పట్టణాల్లో ప్రజల ప్రాథమిక అవసరాలైనా నీరు, డ్రెయినేజీ, విద్యుత్, రోడ్లు, గృహ అవసరాలకు కేటాయించిన మొత్తాలు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రజా రవాణా విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనపర్చకపోగా విమానాశ్రయాల నిర్మాణాలపై కేంద్రీకరిస్తున్నట్లుగా తెలియజేశారు. పట్టణాభివృద్ధికి కేటాయించిన మొత్తాలు జీడీపీలో 0.3 శాతం మాత్రంగానే ఉన్నాయి. ఈ బడ్జెట్ అంతా కూడా పేదల్ని కొట్టి, పెద్దలకు పెట్టే బడ్జెట్‌లాగే ఉంది. ఇది ఏమాత్రం ప్రజల బతుకుల్ని మార్చదు, కొనుగోలుశక్తిని అంతకన్నా పెంచదు. అందుకే బడ్జెట్‌ను వెంటనే సవరించాలి. ప్రజోపయోగ కార్యక్రమాలపై కేంద్రీకరణ జరగాలి. కార్పొరేట్ రంగానికి ఇస్తున్న రాయితీలను తగ్గించి, వారి ఆదాయాలపై నాలుగు శాతం పన్నును విధించాలి. ఈ అసంబద్ధ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహా ధర్నాలో కార్మికులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, పెన్షనర్లు, వృత్తిదారులు, ఇతర కార్మిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలి.

# కొనసాగుతున్న విశాఖ ఉద్యమం




విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు సిద్ధమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ వైఖరికి, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మరో ఉద్యమానికి తెర లేచి నాలుగేళ్లు అయింది. విశాఖ పట్టణంలో ఉక్కు పరిశ్రమ కోసం జరిగిన ఉద్యమం.... ఈ ఉద్యమాన్ని తెన్నేటి విశ్వనాథం నాయకుడై ముందుండి నడిపించారు. తాటికొండ ఎమ్మెల్యే టి. అమృత రావు, ప్రత్తి శేషయ్య లాంటి నాయకులు ఈ ఉద్యమంలో పాల్గొ న్నారు. ఈ ఉద్యమంలో భాగంగా 32 మంది ప్రాణాలర్పించారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అంటూ తెన్నేటి విశ్వనాథం నడిపిన ఉద్యమ ఫలితంగా, నాటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ 1970 ఏప్రిల్ 10 విశాఖ పట్నంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్ప నున్నట్లు పార్లమెంటు లో ప్రకటించింది. కర్మాగారం కోసం కురుపాం జమీందారులు 6000 ఎకరాలను 1970లో దానం చేసారు. 1970 జూన్ లో ఏర్పాటు చేసిన స్థల పరిశీలన కమిటీతో కర్మాగారపు ప్రణాళికలు మొదల య్యాయి. 1971 జనవరి 20న ఇందిరా గాంధీ చేత కర్మాగారం యొక్క శంకు స్థాపన కార్యక్రమం జరిగింది. 26 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి 10వేల కోట్ల రూపాయలతో 20 ఎకరాల భూమి నిచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించింది. 1977 లో నిర్మాణం మొదలైంది. 1979లో రష్యాతో ఒప్పందం కుదుర్చు కున్నారు. రూ.3897.28 కోట్ల అంచనా తో 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగార నిర్మాణం ప్రారంభించారు. కానీ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురు కావడం, ప్రభుత్వాలు మారడం వలన ఇది పూర్తవ డానికి 20 ఏళ్లు పట్టింది. పూర్వ సంయుక్త రష్యా సహకారంతో నివేదికలో అనేక మార్పులు చేర్పులు జరిగాయి. నాటి సీఎం బ్రహ్మానంద రెడ్డి కృషికి 1980లో ఇందిరా గాంధీ చొరవ తోడై, ఫలితంగా 80 నుండి 1983 వరకు విశాఖ ఉక్కు కర్మాగారం వేగం పుంజుకుంది. రష్యాతో సాంకేతిక ఒప్పందం చేశారు. వైజాగ్ స్టీల్ గా ప్రసిద్ధమైన విశాఖ ఉక్కు కర్మాగారం భారతదేశం లోని అత్యాధునిక మైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీ దారు. ఇది, విశాఖ పట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో, జర్మనీ, సోవియ ట్ రష్యాల సాంకేతిక సహకారంతో నిర్మించ బడింది. 1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్తయ్యింది. 1990 సెప్టెంబరులో ఉత్పత్తి ప్రారంభ మైంది. అప్పటికి నిర్మాణ వ్యయం రూ.9 వేల కోట్లకు చేరుకుంది. 1992 ఆగస్టు 8న అప్పటి ప్రధాని పి.వి. నరసింహా రావు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు. మొదట్లో ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మొదటగా నిలిచింది. 1994లో మొదటి సారిగా రూ.50 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. కానీ కర్మాగారం నిర్మాణం కోసం నిధులు లేక పోవడంతో ఇతర సంస్థలపై ఆధార పడటంతో 1998-2000 సంవత్సరంలో ఖాయిలా పరిశ్రమగా మిగిలింది. ఈ సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాలు అనేక ఉద్యమాలు చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఉక్కు వడ్డీలను ఈక్విటీగా మార్చడం జరిగింది. ఆ తర్వాత ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంటూ ప్రపంచ శ్రేణి ఉక్కు కర్మాగారంగా నిలబడింది. కర్మాగారం యొక్క ఉత్పత్తులు మన్నిక కలిగినవిగా దేశ విదేశాలలో పేరుగన్నవి. సంస్థ రాబడిలో 80% జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాలకు చేయ బడుతున్న ఎగుమతుల ద్వారానే వస్తున్నది. 33వేల ఎకరాలలో విస్తరించి ఉన్న వైజాగ్ స్టీల్, భారత దేశంలో తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం. 3.6 ఎం. టి గా ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 6.3ఎం. టి కి పెంచే రూ. 8,692 కోట్ల విస్తరణ ప్రాజెక్టును నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2009 మే 29న ప్రారంభించారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి పాలనలో దాని ఉత్పత్తి సామర్థ్యం పెంచారు. 2010 నవంబరు 10న నవరత్న హోదా పొందినది. కర్మాగారం విస్తరించి ఉన్న ప్రాంతం, భారత దేశం, ఆసియా మైనర్ లలోనే అతి పెద్దది. సంవత్సరానికి 21 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్నప్పటికీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ముడి పదార్థాల కొరత, కొవిడ్ 19 మహమ్మారి, మార్కెట్ తిరోగ మన కారణాల వల్ల 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంకు తగ్గింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఇనుప ఖనిజం గనులు లేక పోవడం వల్ల ఏటా విశాఖ స్టీల్ సుమారు మూడు వేల కోట్లు ఇనుప ఖనిజం కోసం అదనంగా ఖర్చు చేస్తున్నది. టాటా స్టీల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిందాల్ స్టీల్, ఇతర ప్లాంట్లకు... స్వీయ ముడి సరుకు సమకూర్పు లేకుండా, నేషనల్ మినరల్ కార్పొరేషన్ నిర్వహణ లో బైలాదిలా గనులు, ఆస్ట్రియా నుండి ముడి బొగ్గు సరఫరాపై విశాఖ ప్లాంట్ ఆధార పడి ఉండడం వల్ల సమస్యలు ఎదురవు తున్నాయి. ఇలా మరో రెండేళ్ల పాటు నష్టాలు రావడం తథ్యమనే భావనతో, కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర, తెలంగాణకు చెందిన నేతలు పోరాటాలు, కొందరి ప్రాణ త్యాగంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు సంస్థ నేడు ప్రైవేటు పరం కావడాన్ని ప్రజలు జీర్ణించు కోలేక పోతున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. "విశాఖ ఉక్కు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు" అనే నినాదం రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తోంది. వైజాగ్ స్టీల్ ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ అధికార వైఎస్ఆర్సీపీ తో పాటు టీడీపీ, వామపక్షాలు గళమెత్తాయి. సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి) లతో కూడిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జెఎసి) పేరిట ఉద్యోగులు ప్రైవేటీకరణ చర్యకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేసే కార్యాచరణ చేపట్టారు. విశాఖ స్టీలు కర్మాగారాన్ని అమ్మాలనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను మూడేళ్ల కాలంగా ఎదిరిస్తునే ఉన్నారు.. నిరసన గళాలు ప్రకటిస్తూనే ఉన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవం పేరిట అన్ని ప్రాంతాలలో అఖిల పక్ష సమావేశాలు, కోటి సంతకాల సేకరణ ఉద్యమాల లాంటివి నానాటికీ ఉద్ధృతం అవుతున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం పురుడు పోసుకుని, ఫిబ్రవరి 12వ తేదీ నాటికి నాలుగేళ్ళు పూర్తి అయింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం వాపసు తీసుకో వాలని, తీసుకునే వరకూ దీర్ఘకాలిక పోరాటం కొనసాగు తుందని ఆందోళన కారులు స్పష్టం చేస్తూ, దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

# గిరిజన జాతరకు తరగని ఆదరణ



దేశ మాతృగౌరవాన్ని కాపాడే సమున్నత ఆశయ సాధనకోసం జీవితాలను త్యాగం చేసిన సమ్మ క్క, సారలమ్మలను దైవాంశ సంభూ తులుగా ఎంచి, ఉత్తర తెలంగాణ జానపదులు తమ ఆరాధ్య దైవాలుగా కొలవడం సదాచారంగా మారింది. దాదాపు 900 సంవత్సరాల చారిత్రక నేపథ్యం కలిగిన వన దేవతల జాతర పూర్తిగా గిరిజన సాంప్రదాయంలోనే సాగుతుంది. అయితే గిరిజనులే కాక, గిరిజనే తరులు సైతం గద్దెలెక్కిన దేవతల ను కొలవడం వంశపారం పర్య ఆచరణగా కొనసాగుతున్నది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సమ్మక్క- సారలమ్మ మేడారం జాతర ప్రతి రెండేళ్ల కోసారి వైభవంగా జరుగుతుంది. అయితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క -సారలమ్మల సంబంధిత జాతర వేడుకలు వరుసగా ఒక ఏడు పెద్ద, మరో ఏడు చిన్న జాతర ల కార్యక్రమాలు ప్రతిఏటా జరుగుతాయి. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క సారలమ్మ చిన్న జాతరలో అధిక సంఖ్యాకులయిన సాంప్రదాయ భక్తులు పాల్గొనడం వంశ పారంపర్య, సనాతన సంప్రదాయ ఆచరణ.లక్షలాది మందిని ఆకర్షించే మేడారంలో గురువులు లేదా స్వామీజీల లాంటి వారు, మహిమా న్వితులుగా భావించబడేవారు ఎవరూ ఉండరు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద కేవలం ఒకనాడు నిరక్షరాస్యులుగా, నేడు ప్రాపంచిక విషయాలపై అవగాహన ఉన్నట్లు కనిపించే గిరిజన పూజారు లు మాత్రమే ఉంటారు. పరాధీనులు కావడానికి అంగీకరించక, తల ఒగ్గక, లక్ష్యం కోసం ఆత్మార్పణం గావించిన సమ్మక్క, సారలమ్మలను దైవాలకు ప్రతిరూపాలుగా భావించే గిరిజనులు, సంప్రదాయ అచారణాసక్తులు వన దేవతల జాతరకు శతాబ్దాలుగా శ్రమ కోర్చి పిల్లా పాపలతో తరలి వెళ్ళడం వెనక కోట్లాది మంది భక్తుల మొక్కవోని విశ్వాసం ఉంది. మొదటి సారి మేడారంలో సమ్మక్క, సారలమ్మను దర్శించుకునే వారు తప్పని సరిగా మరుసటి జాతరకు వస్తారని, దీనికి కారణం ఒక సారి దర్శనం చేసుకున్న వారికి కోరిన కోర్కెలు తీరడం, అటుంచి మానసి క ప్రశాంతత, తమలో ఏదో తెలియ ని కొత్త చైతన్యం రావడమేనని అనుభవజ్ఞులైన భక్తుల భావన. మేడారం జాతర గిరిజన సాంప్రదా యాలకు ప్రతీక. సంస్కృతి ప్రియు లకు నిజమైన పండుగ. సామూ హిక భాగస్వామ్యానికి వేదిక. పూన కాలతో ఊగి పోయే శివసత్తులు, సంప్రదాయ వంశపారంపర్య ఆచరణలో భాగంగా, జాతరకు ముందు నుండే ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడం, ముందుగానే ఎన్ని అసౌకర్యాలున్నా గుడారాలు వేసుకొని వేచి ఉండడం, నిలువెత్తు బంగారం (బెల్లం)తో రావడం, జంపన్న వాగులో స్నానాలు, వాయిద్యాల విన్యాసాలు, నిరంతర జంతు బలులు, అమ్మవార్లకు మొక్కులు, కలగలిపి మేడారం జాతర గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దమై నిలుస్తున్నది. దేశ విదేశీ సందర్శకు లను, భక్తులను, యాత్రికులను, చారిత్రక పరిశోధకులను, ఫొటో గ్రాఫర్లను, జర్నలిస్టులను ఈ జాతర ఎంతగానో ఆకర్షిస్తున్నది. రుజువుకు అందనంత ప్రాచీన కాలం నుండి మేడారం జాతరకు ఎడ్లబండ్లపై రాకపోకలు ప్రధానంగా జరిగేవి. ఎడ్ల బండ్ల ద్వారా జంపన్న వాగులో నుండి మేడారం చేరుకోవా లనేది స్థానిక గిరిజనుల సాంప్రదా య ఆచరణ. అయితే, 1996 నుండి జంపన్న వాగుపై భక్తుల స్నానాలకు అనువుగా స్నాన ఘట్టాలు వాగు పొడవునా నిర్మించడంతో జంపన్న వాగు దాటడానికి అనువుగా లేకపోవడం, కారణంగా ఎడ్ల బండ్ల సంఖ్య 90 శాతం తగ్గింది. అయినా కొందరు పాత పద్ధతిలోనే, ప్రస్తుతం వందల సంఖ్యలో మాత్రమే ఎడ్ల బండ్లపై జాతరకు వస్తున్నారు. మొట్ట మొదటి సారిగా 1998లో నాటి అవిభక్త రాష్ట్ర ప్రభుత్వం మేడారంతో పాటు పరిసర గ్రామాలలో కూడా అంతర్గత బిటి, సిసి రోడ్ల నిర్మాణాలను చేపట్టడంతో దుమ్ములేసే అవకాశం గణనీయంగా తగ్గింది. ఇటీవలి కాలంలో కోట్లాది నిధులతో సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వ కృషి జరిగిన క్రమంలో, రెండేళ్ల కోసారి జరిగే జాతర సమయంలో వచ్చే భక్తులు మేడారానికి రవాణా మార్గాలు కూడా మెరుగవడంతో తాము అనుకున్నపుడు, ఎప్పుడంటే అప్పుడు వెళ్లి సమ్మక్క సారలమ్మ తల్లుల దర్శనాలు చేసుకుంటున్నారు. గోదావరిపై వంతెనల నిర్మాణంతో పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, చత్తీస్ గఢ్, మహారాష్ట్ర, ఒడిసాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారు. విస్తృతమైన సోషల్ మీడియా ద్వారా మేడారం జాతర ప్రపంచ వ్యాపితం అయింది. గిరిజన జాతరగా మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతరను ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు నిర్వహించేందుకు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ఘనంగా జరుగనుంది. జాతరలో భాగంగా నాలుగు రోజులపాటు వివిధ కార్యక్రమాలను అర్చకులు నిర్వహించ నున్నారు.నాలుగు రోజులలో ఏరోజు ప్రత్యేకత ఆ రోజుకు ఉంది. ఉత్తర తెలంగాణ నుండి అధిక సంఖ్యాకులైన భక్తులు ఈ జాతరకు సనాతన సంప్రదాయ వారసత్వ ఆచారంలో భాగంగా క్రమం తప్పకుండా వెళ్లడం పరిపాటి. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేవిధంగా ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. ఈసారి ఫిబ్రవరి 12, 13, 14, 15వ తేదీలలో సమ్మక్క సారక్క మినీ మేడారం జాతర నిర్వహించేందుకు ఆదివాసి పూజారులు వారం రోజుల ముందే ఆదివాసీల ఆచారాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ కుంభమేళ మేడారం మహా జాతర రెండేళ్లకోసారి జరుగుతుంది. ఐతే మహా జాతర జరిగిన మరుసటి యేట ఆదివాసీలు పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతుంది. ఆదివాసీల పండుగ మినీ జాతరగా ప్రాశస్త్యంలోకి వచ్చింది.బుధవారం రోజున మేడారంతో పాటు అనుబంధ గ్రామాలు, ఆలయాలతో ఊరుకట్టు నిర్వహించి, ఆలయాలను శుద్ధి చేసి సంప్రదాయ బద్ధంగా పూజలు చేయడం ఆనావాయితీ. ఫిబ్రవరి 12న మండ మెలిగే పండుగ, 13వ తేదీన సారలమ్మ అమ్మవారి గద్దె, 14వ తేదీన సమ్మక్క గద్దె శుద్ధి చేసి సమ్మక్క - సారలమ్మలకు భక్తులు మొక్కులు సమర్పించుకునేందుకు అనుమతిస్తామని చెప్పారు. మినీ మేడారం జాతరలో అమ్మవార్లను గద్దెలపైకి తీసుకురారు. కానీ, గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారు.దీంతో మహా జాతర సమాప్తమవుతుంది.

# రెండు లారీలు "ఢీ" ఒకరు మృతి- మరొకరికి గాయాలు



**అగ్ని ధార న్యూస్. మందమర్రి మండలం ఫిబ్రవరి 11. :** మంచిర్యాల జిల్లాలో.. గల మందమర్రి మండలంలోని పులిమడుగు, మేడారం సమీపంలో గల, జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో.. రెండు లారీలు ఒకటి–ఒకటికి ఢీకొనడంతో, ఒక లారీ డ్రైవర్ కొన ఊపిరితో అక్కడికక్కడే సంఘటన స్థలంలోనే మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.ఆ క్రమంలో చూస్తే..మేడారం సమీపంలోని, జాతీయ రహదారిపై ఉన్న లారీని వెనకాల నుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది.దాంతో ఒక లారీ బలంగా ఫల్టీకొడుతూ.. పక్కకు పడింది.ఆ ఢీ కొట్టిన లారీలో ఉన్న డ్రైవర్ కనకయ్య (40) అనే వ్యక్తి కన్నాల బసంత్ నగర్ లోని, నివాసిడిగా గుర్తించారు.అలాగే అక్కడి చెట్లకు నీళ్లు పడుతున్న మందమర్రికి చెందిన తిరుపతి కి సైతం ఆ ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే వాళ్ళిద్దరినీ మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ సందర్భంగా మందమర్రి ఎస్ ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో.. పోలీసులు ట్రాఫిక్ జాం లేకుండా ఏర్పడకుండా కట్టుదిట్టమైన విధులు నిర్వహించడం కనిపించింది.ఆ మేరకు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు కల్వకుర్తిలో మంత్రుల పర్యటన విజయవంతం చేయాలి

### యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆశాదిప్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండల పరిధిలోని 2గంటలకు మార్చాల గ్రామంలో సిసి రోడ్డు ప్రారంభోత్సవం, మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపాలిటీ పరిధిలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణ రావు, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొనడం జరుగుతుంది కావున కాంగ్రెస్ పార్టీ యువజన కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మీడియా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొనీ విజయవంతం చేయగలరు.

# కల్వకుర్తి లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బి ఆర్ ఎస్ పోస్టర్లు



### ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి నియోజకవర్గం లోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు మరియు గ్రామాలు ,పల్లెలు, తండాలలో అన్నిచోట్ల బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ప్రజలకి ఇచ్చిన 420 హామీలను నెరవేర్చాలని ,ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అబద్ధపు హామీలను ఎండగడుతూ గోడపత్రికలను ముద్రించి ప్రతి గ్రామ గ్రామాన, పల్లెల్లో ,మున్సిపాలిటీలో రాత్రికి రాత్రికి అంటించడం తీవ్ర కల్లోలాన్ని సృష్టిస్తుంది.ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు అని ప్రజల్లో చర్చ జరుగుతున్న వేళ ఈ గోడ పత్రిక ద్వారా ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మూటగటుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పోస్టల్లతో మరింత అగ్ని రాజేసిందని మేధావులు అభిప్రాయ పడుతున్నారు.మరోవైపు ఉప్పల వెంకటేష్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు స్థానిక సంస్థలలో నిలబడే సర్పంచ్ ,ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులకు ఈ గోడ పత్రికల ద్వారా కాంగ్రెస్ అబద్ధపు హామీలను ప్రజలకు తీసుకువెళ్లి స్థానిక సంస్థలలో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడం కోసం ఉపయోగపడుతుందని బిఆర్ఎస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# రఘుపతి పేట దుందుభి వాగు పై బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

### ఎంపీ మల్లు రవి కి వినతి పత్రం అందజేసిన కుర్మయ్య



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి– తెల పల్లి రోడ్డు మార్గం లో రఘుపతిపేట దగ్గర దుందుభి నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి కి రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ మేకల కురుమయ్య లేఖ రాయడం జరిగింది. రఘుపతిపేట దగ్గర మరియు సిర్సవాడ గ్రామాల దగ్గర వంతెన నిర్మాణాలు చేపడితే ఇరు ప్రాంతాల ప్రజలకు రవాణా పరంగా, వ్యాపారపరంగా మేలు జరుగుతుందని ఎంపీ మల్లు రవి కి విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఈసందర్భంగా ఎంపీ మల్లు రవి సానుకూలంగా స్పందించారని కురుమయ్య పేర్కొన్నారు. నేను ఇచ్చిన వినతిపత్రంతో తెలంగాణ పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్ మెంట్ కార్యదర్శి కి ఎంపీ మల్లు రవి మరొక లేఖ రాయడం జరిగిందని తెలియజేశారు. ఇవాళ డా.బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్ మెంట్ కార్యదర్శి ని మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీ మల్లు రవి కి లేఖను అందజేయడం జరిగిందని కురుమయ్య పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో.. సివిల్స్ అభ్యర్థులకు మాక్ ఇంటర్వ్యూలు




**అగ్ని ధార న్యూస్. మందమర్రి మండలం ఫిబ్రవరి 11. :** సింగరేణి భవన్ లో నిర్వహించిన సీనియర్ అధికారులుసింగరేణి భవన్, ఫిబ్రవరి 11, 2025ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ మౌఖిక పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థుల కోసం, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క మల్లు ఆదేశాలతో.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి పర్యవేక్షణలో, మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సివిల్స్ ప్రిలిమినరీ పాసైన వారికి, లక్ష రూపాయల ప్రోత్సాహం,మెయిన్స్ లోనూ విజయం సాధించిన వారికి మరో లక్ష రూపాయల ప్రోత్సాహాన్ని అందించిన విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగానే ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించి, వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మార్గనిర్దేశంలో సీనియర్ అధికారుల నేతృత్వంలో, నమూనా మౌఖిక పరీక్షలను నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు గత 15 రోజుల నుంచి ఆన్లైన్ పద్ధతిలో మాక్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారు. వీటిల్లో సింగరేణి సీఎండీ, ఎన్.బలరామ్, ట్రాన్స్ కో సీఎండీ. కృష్ణ భాస్కర్, కామారెడ్డి ఎస్పీ. శ్రీమతి సింధూ శర్మ, ప్యానెల్ సభ్యులుగా వ్యవహరించారు.మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ,సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ట్రాన్స్ కో సీఎండీ. కృష్ణ భాస్కర్, తెలంగాణ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, హైదరాబాద్ కలెక్టర్, అనుదీప్ దురిశెట్టి ప్యానెల్ లో మాక్ ఇంటర్వ్యూలు జరిగాయి. ప్యానెల్ సభ్యులు ఒక్కొక్క అభ్యర్థిని వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగారు. అనంతరం తుది ఇంటర్వ్యూను ఎలా ఎదుర్కోవాలి ? అన్న అంశంపై పలు కీలకమైన సూచనలు చేశారు. ఆత్మ విశ్వాసంతో సిద్ధం కావాలని, సందేహాలను నివృత్తి చేయడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు రానున్న రోజుల్లో మరిన్ని మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మాక్ ఇంటర్వ్యూల్లో పాల్గొన్న అభ్యర్థులు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం తమను ప్రోత్సహించడం కోసం రెండు విడతలుగా ఆర్థిక సాయం చేయడమే కాకుండా ఇప్పుడు మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించడం, అలాగే తెలంగాణ భవన్ లో ఉండటానికి ఏర్పాట్లు చేయడానికి ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# పొలంలో అమర్చిన కరెంటు తీగ తగిలి రైతు, మూగ జీవి మృతి

### వన్య ప్రాణుల కోసం కరెంటు తీగలు అమర్చిన వారిపై కఠిన చర్యలు తప్పవు..



**అగ్ని ధార న్యూస్. మందమర్రి మండలం ఫిబ్రవరి 11**

మంచిర్యాల జిల్లా, దేవపూర్ సర్కిల్ కోనూరు గ్రామం ఉదయం 5 గంటలకు అంకతి మల్లయ్య ,మృతుడు నిద్రలేచి తన బర్రె కనిపించడం లేదని తన కుమారుడు అయిన అంకతి శ్రీకాంత్,ఫిర్యాది కు తెలిపి బర్రెను వెతుక్కుంటూ.. వెళ్ళినాడు. ఫిర్యాది కొంత సమయానికి బర్రెను వెతుక్కుంటూ వెళ్లగా నాన్న అని గట్టిగా పిలిచిన పలకపోయేసరికి ఫిర్యాది మాటలు విన్న అతని వరస కు అన్నలు అయిన అంకతిమల్లేష్,అంకతి భూమయ్యలు విషయం తెలుసుకొని వెతుకుతుండగా మృతుడు, అంకతి రాజయ్య నేరస్తుడు. యొక్క ఇంటి వెనకాల పెరడులో అంకతి రాజయ్య, అమర్చిన జె వైరుకు తగిలి కరెంటు షాక్ తో మృతి చెందాడు. కొంత దూరంలో బర్రె కూడా చనిపోయి ఉన్నది. అంకతి రాజయ్య నిర్లక్ష్యంతో తన ఇంటి నుండి కరెంటు వైరు తో జె వైరు కు కరెంటు అమర్చడం వలన మనుషులు లేదా జంతువులు చనిపోతాయని తెలిసి, కూడా కరెంటు వైర్ తన పెరడుకు అమర్చి ఒక వ్యక్తి,చావుకు కారణమయ్యాడు.

మృతుడి కొడుకు శ్రీకాంత్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పంచనామా నిర్వహించి అంకతి మల్లయ్య, మృతికి కారణమైన నేరస్తుడు అయిన అంకతి రాజయ్య ను, ఈరోజు సాయంత్రం అరెస్ట్ చేసి, రిమాండ్ కొరకు పంపనైనది.మృతుడి యొక్క వివరాలు: అంకతి మల్లయ్య ఎస్/ఓ కోటయ్య, వయసు:64 సంవత్సరాలు, కులం: పెరిక, వృత్తి: వ్యవసాయం, నివాసం కోనూరు. నేరస్తుడి యొక్క వివరాలు అంకతి రాజయ్య ఎస్/ఓ వెంకటయ్య, వయసు: 55 సంవత్సరాలు, కులం: పెరిక వృత్తి: వ్యవసాయం, నివాసం: కోనూరు.

**పొలిసు వారి హెచ్చరిక**

రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం శ్రీనివాస్, ఐపీఎస్, ఐజి మరియు డిసిపి, మంచేరియాల్ ఎ.భాస్కర్ ఐపీఎస్ ఆదేశాల ప్రకారం రైతులు ఎవరుకూడా తమ పంట పొలములకు కరెంటు వైరులు అమర్చవద్దు అట్టి కరెంటు వైరులకు తగిలి మనుషులు మరియు జంతువులు మృతి చెందుతాయి. రైతులు ఎవరైనా కరెంటు వైరులు అమర్చినచో వారి పై కఠిన చర్యలు తీసుకోబడును.

# ఉన్నతంగా ఆలోచిస్తే లక్ష్యాలను చేరుకుంటారు




### ప్రేరణా సదస్సులో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి) :** ఆమనగల్ పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్ నందు.ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్ ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి విద్యార్థుల ప్రేరణ సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టాస్క్ సి.ఓ.ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మహేందర్ గురుతో కలిసి పాల్గొనడం పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ వ్యాప్తంగా 20 కి పైగా పాఠశాలల నుండి. 1200 మంది వరకు పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు,1200 మంది విద్యార్థులందరికీ ఐక్యత ఫౌండేషన్ ద్వారా ఎగ్జామ్స్ కిట్(ప్యాడ్స్,పెన్స్) పంపిణీ చేయడం చేశారు.

ఈ సందర్భంగాసుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ....విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళిక బద్దంగా చదువుతూ ఉన్నత శిఖరాలను చేసుకోవాలని తెలుపుతూ పదవ తరగతి పరీక్షల్లో నియోజకవర్గ వ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువైన సూచనలు అందించాలని అన్నారు.ఇంత చక్కటి కార్యక్రమం ఏర్పాటు చేసి ఐక్యత ఫౌండేషన్ భాగస్వామ్యం చేసినందుకు ఉపాధ్యాయుల బృందానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించి, విజయవంతం చేసిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ట్రాస్మా తరుపు నుండి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలోఆమనగల్ ఎం.ఇ.ఓ.పాండు తలకొండపల్లి ఎం.ఇ.ఓ చాంప్ల నాయక్ తో పాటుట్రస్మా స్టేట్ అడ్వైజర్స్ వెంకటయ్య,చుక్క అల్లాజి గౌడ్,నిరంజన్,ఆమనగల ట్రస్మా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ శివలింగం,ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, ట్రెసరర్ రమేష్, ట్రస్మా సభ్యులు మహమూద్,సుదీర్ రెడ్డి,శేఖర్,వెంకటేష్, తిరుమలేశ్,ఆంజనేయులు,శ్రీనివాస్,అశోక్ రెడ్డి,సువర్ణ గోవర్ధన్ రెడ్డి,జంగయ్య,చంటి, మల్లేష్,బిజ్జు,రమేష్,లతో పాటు,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నరేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి,చంద్రశేఖర్, అభినవ్ రెడ్డి,రాజశేఖర్, కొండల్ రెడ్డి,కృష్ణ యాదవ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కంటి చూపు సరిగా ఉన్నప్పుడే విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తారు

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** విద్యార్థులకు కంటిచూపు సరిగా ఉన్నప్పుడే చదువుపై చక్కగా దృష్టి కేంద్రీకరించగలరని, అందుకోసమే జిల్లాలోని విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని జడ్పీ ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, కంటి చూపు సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సాధించాలంటే, కంటి చూపు ఎంతో కీలకమని అన్నారు. కంటిచూపు సరిగా లేకపోతే చదువుపై దృష్టి కేంద్రీకరించక, పరీక్షల్లో రాణించలేక పోవడం జరుగుతుందన్నారు. అందుకే, జిల్లాలోని, 300 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 30 వేలకు పైగా మంది విద్యార్థులకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అందులో దాదాపు 2వేల మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించిన్నట్లు చెప్పారు. అలా సమస్యలు గుర్తించిన వారిలో 946 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.లి ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువుపై దృష్టి సాధించి మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కంటిచూపు సరిగా ఉన్నప్పుడే బాగా చదవగలరని భావించిన కలెక్టర్ తన నిధుల నుంచి ప్రత్యేకంగా విద్యార్థుల కోసం ఉచితంగా కళ్లద్దాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. కాబట్టి విద్యార్థులు చక్కగా చదువుకొని పరీక్షల్లో బాగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, బాలుర పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వర స్వామిని దర్శించుకొన్న మాజీ మంత్రి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** ఖిల్లా ఘనపూర్ మండలం గట్టుకాడిపల్లి శ్రీ లక్ష్మీ అల్మేర్ మంగ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతములో గట్టుకాడిపల్లి దేవస్థానం,గ్రామ అభివృద్ధి కోసం కృషి చేశామని ఈ దేవస్థానం దినదిన అభివృద్ధి జరుగుతుందని రాబోవు కాలంలో అభివృద్ధి కోసం కృషి చేస్తామని అన్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు నిరంజన్ రెడ్డిని ఆహ్వానించి స్వామి వారి పట్టు వస్త్రంతో సన్మానించారు. నిరంజన్ రెడ్డివెంట లక్ష్మమారెడ్డి, రాళ్ళ.కృష్ణయ్య, సామ్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఆర్థిక స్వావలంబన పై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, సిఎమ్ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో మహిళలంతా ఆర్థిక స్వావలంబన సాధించాలని, తదనుగుణంగానే ప్రభుత్వం మహిళా భాగస్వామ్యంతో అనేక పనులు చేపట్టిందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారుమంగళవారం ఖిల్లా ఘనపురం మండల పరిధిలోని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసే కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారుఈ సందర్భంగా 34 మంది కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లబ్ధిదారులకు35 మంది ముఖ్యమంత్రి సహాయనిది లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేశారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న జయంతో ముందుకెళుతుందని చెప్పారుమహిళలంతా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని. ఇందులో భాగంగానే పాఠశాల విద్యార్థులకు డ్రస్సులను కుట్టే పనులను మహిళలకు అప్పజెప్పడం బస్సులలో ఉచిత ప్రయాణం చేపట్టడంమహిళా సంఘాల మహిళల భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయడంవరి ధాన్యం కొనుగోలులో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంవిద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏర్పాటులో మహిళలకే తొలి ప్రాధాన్యం ఇవ్వడం లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారుప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు నిర్మాణమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంఎస్సీ కాలనీలో బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందికాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ పక్కా ఇల్లు నిర్మాణమే లక్ష్యంగా ముందుకెళుతుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఖిల్లా ఘనపురం మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన సిసి రోడ్ల నిర్మాణాలకు, డ్రైనేజీల నిర్మాణాలకు, బీట్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేపట్టారు ఈ సందర్భంగా మ్మెల్యే మానాజీపేట గ్రామంలో మానాజి పేట గ్రామం నుంచి ఉప్పరపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి సి ఆర్ ఆర్ నిధుల నుంచి మంజూరైన రెండు కోట్ల రూపాయల పనులకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారుమానాజి పేట గ్రామం నుంచి శాపూర్ గ్రామానికి సి ఆర్ఆర్ నిధుల నుంచి 1 కోటి యాభై లక్షలతో బీటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారుమానజిపేట గ్రామంలోని SC కాలనీలో సీఆర్ ఎస్సిపి ఎనర్జీ నిధుల నుంచి20 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణానికి డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారుమల్కాపురం గ్రామంలో సి ఆర్ ఆర్ , ఎస్సిపి నిధుల నుంచి 7,50,000 రూపాయల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డు నిర్మాణానికి డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు షాపూర్ గ్రామంలో సి ఆర్ ఆర్ ఎస్ సి పి 45 లక్షల వ్యయంతో నిర్మించే డ్రైనేజీల నిర్మాణానికి సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారుపర్వతాపురం గ్రామంలో సి ఆర్ ఆర్ సి ఆర్ ఆర్ నిధులు 10 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డుకు డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారుమామిడి మాడ గ్రామంలో సి ఆర్ ఆర్, ఎస్సిపి , ఎంజిఎన్ఆర్జిఎస్ నిధులు 20 లక్షల వ్యయంతో నిర్మించే డ్రైనేజీలకు సిసి రోడ్లకు భూమి పూజ చేశారుసల్కేలాపురం గ్రామం నుంచి నాగర్ కర్నూల్ శివారు గౌరారం వెళ్లే బీటి రోడ్డు నిర్మాణానికి 2 కోట్ల 25 లక్షలతో నాగర్కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే గౌరవ శ్రీ తూడు మేఘారెడ్డి గారు శంకుస్థాపన చేశారు సి అర్ పి నిధులు రెండు కోట్లతో సల్కేలాపురం నుంచి చేగుట్ట బీట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారుసల్కేలాపురం గ్రామంలో సి ఆర్ ఆర్ ఎస్సిపి నిధులు పదిహేను లక్షలతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణ లకు శంకుస్థాపనలు చేశారుఅప్పారెడ్డి పల్లి గ్రామంలో పిడబ్ల్యుడి రోడ్డు నుంచి అప్పారెడ్డిపల్లి గ్రామం వరకు బీటి రోడ్డు నిర్మాణానికి సి ఆర్ ఆర్ నిధులు 85 లక్షల వ్యయంతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారుఅప్పారెడ్డిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు, సిసి రోడ్ల నిర్మాణానికి సీర్ సీపీ , ఎంజిఎన్ఆర్ నిధులు 15 లక్షలతో చేపట్టే పనులను ప్రారంభించారుమల్కిమియన్ పల్లి గ్రామంలో సి బి ఎఫ్ నిధులు 5 లక్షలతో నిర్మించే మహిళా సంఘ భవన నిర్మాణానికి, సి ఆర్ ఎఫ్ నిధులు 10 లక్షలతో చేపట్టే డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బి ఆర్ ఎస్ పాలనలో గ్రామీణ రహదారులు, ఎస్సీ కాలనీల అభివృద్ధిని ఏ కోశానా పట్టించుకోలేదని, నేడు ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాలలోని ఎస్సీ కాలనీలా అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారుకార్యక్రమంలో సాయి చరణ్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, వెంకట్రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మానాజీపేట మాజీ సర్పంచ్ సతీష్, క్యామా రాజు, ఆగారం, ప్రకాష్, లక్ష్మారెడ్డి, రవి నాయక్, దామోదర్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, రాములు నాయక్, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులుతదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలి

## జిల్లా ఎస్పీరావుల గిరిధర్



**వనపర్తి అగ్ని ధార న్యూస్ , ఫిబ్రవరి 11:**బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా బాలల సంరక్షణ శాఖ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, భరోసా శాఖ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహం, చేసుకున్న ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ పి హెచ్చరించారుబాల్య వివాహాలను ప్రోత్సహించడం, బాలలను పనిలో పెట్టుకుని కార్మికులుగా మార్చడం వంటి చర్యలకు పాల్పడేవారిపై తప్పనిసరిగా కేసు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ అన్నారు. బాల్య వివాహాలకు బాధ్యులైన తల్లిదండ్రులు, బంధువులు, పూజారులు ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. గత రెండేళ్లలో బాల్య వివాహాలకు సంబంధించిన జాబితా తీసి విచారించి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని చెప్పారు.

బాల్య వివాహాల నియంత్రణకు గ్రామ స్థాయిలో "గ్రామీణ స్థాయి బాలల సంరక్షణ కమిటీ(వీసీపీసీ), మండల బాలల పరిరక్షణ కమిటీ (MCPC)ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి వారం ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో అంగన్వాడీలు వీసీపీసీ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. అన్ని మతాలకు సంబంధించి వివాహాలు జరిపించే పెద్దలను కూడా ఈ సమావేశాలకు ఆహ్వానించాలని చెప్పారు. బాల్య వివాహాలకు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు ఉంటాయని సమావేశాల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు."చైల్డ్ మ్యారేజ్ ప్రెవెన్షన్" అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వాళ్ళ వివాహాలు చేసుకున్న ప్రోత్సహించిన అలాంటి వారిపై రెండు సంవత్సరాల జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా ఉంటుందని ఎస్పీ తెలిపారు. బాలల సంరక్షణకు 24 గంటలు హెల్ప్ లైన్ ఫోన్ నెంబర్ '1098 అందుబాటులో ఉంటుందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్ళ లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపైనా కేసులు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు. కారా(సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) వెబ్సైటు ప్రక్రియ ద్వారా కూడా పిల్లల్ని దత్తత తీసుకోవచని చెప్పారు. ప్రభుత్వం నుంచి దత్తత తీసుకోవడం ద్వారా తల్లిదండ్రులకు పిల్లలకు ప్రభుత్వపరంగా న్యాయం భద్రత లభిస్తాయని చెప్పారు. బయట వ్యక్తుల నుంచి దత్తత తీసుకోవడం నేరమని, అందుకుగాను లక్ష రూపాయల జరిమానా మూడు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో డిసిఆర్బి డీఎస్పీ, ఉమామహేశ్వరరావు, DWOసుధారాణి. స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, షీ టీం ఎస్సై, అంజద్, డిసిఆర్బి ఎస్సై, తిరుపతి రెడ్డి, డీసీపీవో, రాంబాబు, భరోసా కోఆర్డినేటర్, శిరీష, సఖి కేంద్రం. భరోసా కేంద్రం డిసిపి యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులను నిండా ముంచిన బీఆర్ఎస్ మహాదీక్ష చేయడం విడ్డూరంగా ఉంది

## మండ్ల దేవన్ననాయుడు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**రైతుల పక్షాన ధర్నా చేసే అర్హత బీఆర్ఎస్ కు లేదని కాంగ్రెస్ నాయకులు వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు ప్రకటనలో పేర్కొన్నారు మంగళవారం వారు మాట్లాడుతూ బీఆర్?ఎస్? వర్కింగ్?ప్రెసిడెంట్? కేటీఆర్?వి దొంగ దీక్షలు అని మండ్ల దేవన్న నాయుడు అన్నారు. కాంగ్రెస్?ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు మేలు చేస్తుంటే ఓర్వలేకనే కేటీఆర్ ధర్నాల పేరుతో షో చేస్తున్నాడని విమర్శించారు. కేటీఆర్ తీరుపై . రైతులతోపాటు రైతు కూలీలకు సైతం ప్రభుత్వం సాయం అందిస్తేంటే కేటీఆర్?జీర్ణించుకోలేకపోతున్నాడని విమర్శించారు. "గతంలో కేసీఆర్?ప్రతి రైతుకు యూరియా ఫ్రిగా ఇస్తానని.. ఇయ్యాలే ఆయ నమీదేందుకు ధర్నా చేయలేదని" కేటీఆర్?ను ప్రశ్నించారు.

గతంలో బీఆర్?ఎస్? రుణమాఫీ చేయకపోవడంతోనే కాంగ్రెస్?ప్రభుత్వంపై భారం పడిందన్నారు. కేటీఆర్?కు మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. గత బీ ఆర్ఎస్ హాయంలో వనపర్తికి చెందిన ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ మంత్రిగా ఉంటూ చేసిన అభివృద్ధి, ఏంటో జిల్లా రైతులకు తెలుసని, గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి అవినీతి లేని పాలనను నియోజకవర్గంలో కొనసాగిస్తున్న విషయాన్ని బీఆర్ఎస్ నేతలు గమనించాలన్నారు. బీ ఆర్ఎస్ ఏ ధర్నా చేసిన ప్రజలు నమ్మరు అని పేర్కొన్నారు

# ఆయన ఆశయాలను నరేంద్ర మోడీ అమలుపరిచాడు



## బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా :** పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను నేడు నరేంద్ర మోడీ నెరవేర్చాడని పండిత్ వర్ధంతి సందర్భంగా మంగళవారం వనపర్తి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ అన్నారు. భారతీయ జనతా పార్టీ వనపర్తి జిల్లా కార్యాలయంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏకాత్మ మనవతావాదాన్ని ప్రవచించి అంత్యోదయ విధానాన్ని రూపొందించి ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన బిజెపికి పటిష్ట పునాదులు వేసిన బిజెపి వ్యవస్థాపకులు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా వారి స్మృతికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు దుప్పల్లి నారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ ముస్లిం సంతుష్టి కరుణ హిందూ ధర్మ వ్యతిరేక విధానాలకు నిరసనగా 1951 అక్టోబర్ 21న భారతీయ జనసంఘ్ ఏర్పాటు చేయడం జరిగిందని తదనంతరం జనతా పార్టీ, భారతీయ జనతా పార్టీగా నేడు దేశంలో 21 రాష్ట్రాలలో బిజెపి బిజెపి అధికారంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో 3 వ పర్యాయం కేంద్రంలో అధికారం చేపట్టి పండిత్ దీన్దాయాల్ ఉపాధ్యాయ అంత్యోదయ యోజన పాలనతో 25 కోట్ల గ్రామీణ ప్రజలను బిపిఎల్ నుండి బయటకు తీసుకు రాగలిగారని జమ్ము కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు చేయాలన్న డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దీన్ దయల్ ఉపాధ్యాయల అభిష్టాన్ని ప్రధానమంత్రి నేడు పూర్తి చేశాడని ఆయన అన్నారు.

# వీధిలో కూరగాయలు అమ్మే వృద్ధురాలు ఆకస్మిక మరణం



**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఓ వృద్ధురాలు కూరగాయలు అమ్ముకుంటూ ఒక్కసారిగా కుప్పకూలింది. వృద్ధురాలు చిర్ల శంకరమ్మ (65) అని, భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారాం గ్రామంగా గుర్తించారు. వృద్ధురాలు మంథని చౌరస్తాలో కొద్ది రోజులుగా కూరగాయలు అమ్ముకుంటూ జీవిస్తుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వృద్ధురాలు రోజు వారీగా కూరగాయలు అమ్ముకుంటుందని అన్నారు. మంగళవారం కూడా కూరగాయలు అమ్ముతూ మధ్యాహ్నం మండుటెండలో కూరగాయలు అమ్ముతూ ఆకస్మిత్తుగా సొమ్మ సిల్లీ పడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్సు కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే చనిపోయినట్టు తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, ఇద్దరు కూతురులు ఉన్నారు.

# సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలి



**అగ్నిదార న్యూస్మహమ్మదాబాద్ గండీడ్:**మక్త వెంకటాపురంలో జరిగే శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్286వజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ శాంతి కోరారు. వికారాబాద్ జిల్లా ఎస్ టి సెల్ .అధ్యక్షుడు శివరాం నాయక్,అధ్యక్ష్యాతన వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండలం,మక్తావెంకటాపూర్ తండాలో జరిగే 286వ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలుతాలూకా స్థాయి ప్రోగ్రామ్ ను ప్రతి ఒక్కరూ విచ్చేసి విజయవంతం చేయగలరని పిలుపునివ్వడం జరిగిందిగండీడ్ మండల మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా మాజీ యంపీ టి సిలు సునితా మెహన్ నాయక్ , గండీడ్ మండలం ఎస్ టి సెల్ అధ్యక్షుడు కోట్యానాయక్, లొక్యానాయక్ వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ మెంబర్లు, గిరిజన బంజారా సంఘాల నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు,.. 15.02.2025 శనివారం నాడు ఉద్యోగులు నిరుద్యోగులు, గిరిజన బంజారా వివిధ సంఘాల నాయకులు, గిరిజన బంజారా మహిళా ఉద్యోగులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండలం మక్త వెంకటాపూర్ తండాకి తరలి రావాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

# పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్/ గండీడ్:** గండీడ్ మండలంలోని జంగం రెడ్డి పల్లి గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కలశ సమర్జనం కార్యక్రమాలు నిర్వహించగా గ్రామంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు ,యువకులు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# శ్రీవారి కళ్యాణం చూతము రారండి...

## నంచర్ల లో శ్రీ వెంకటేశ్వర స్వామి గుట్టపై స్వామివారి కళ్యాణం



**అగ్నిదార న్యూస్మహమ్మదాబాద్:** మండలం నంచర్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి గుట్టపై స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు మంగళవారం తెలిపారు. మంగళవారం రోజు స్వామివారి అభిషేకం, హెూమ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం గ్రామంలో స్వామివారి పల్లకి సేవ అనంతరం స్వామి వారి కళ్యాణం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం సాయంత్రం బండ్లు తిరిగే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీవారి భక్తులు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు.

# గడువులోపు పురోగతిలో ఉన్న పనులు పూర్తి చేయాలి

## పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** ఒప్పందంలో పేర్కొన్న గడువులోపు పురోగతిలో ఉన్న అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళ వారం సాయంత్రం ఇంజనీరింగ్ అధికారులు , కాంట్రాక్టర్ లతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సంధర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బిల్లులు రికార్డ్ చేయడంలో ఉద్దేశ్య పూర్వకంగా జాప్యం చేసి కాంట్రాక్టర్లను అధికారులు , సిబ్బంది ఇబ్బంది పెట్టినట్లయితే ప్రత్యేకాధికారి గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ కు లేదా తనకు నేరుగా ఫిర్యాదు చేయాలని అన్నారు. పూర్తయిన పనికి సంబందించి రికార్డులు సాధ్యమైనంత త్వరగా నమోదు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా , నిర్ణీతగడువులోగా పూర్తి చేయకపోయినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు సదరు కాంట్రాక్టర్ల పేర్లను బ్లాక్ లిస్ట్ లో చేర్చడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత కొత్త పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్ ఇ శివానంద్ , ఇ ఇ రామన్ తదితర ఇంజనీరింగ్ అధికారులతో పాటు పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# సింగరేణి నూతన డైరెక్టర్లను సన్మానం

## గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు



**అగ్నిధార న్యూస్, (రామగుండం):** సింగరేణి సంస్థలో నూతనంగా ఎన్నికైన ఇద్దరు డైరెక్టర్లను సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రధాన కార్యదర్శి, కొరిమి రాజ్ కుమార్ లు మంగళవారం నాడు హైదరాబాదులో డైరెక్టర్ ఆపరేషన్ ఎల్.వి సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్ల లను కలిసి వారికి శాలువా కప్పి సన్మానించి, పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ మనుగడకు, కార్మికుల సంక్షేమం కొరకు, కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయాలని వారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డైరెక్టర్ లను కోరారు.

# సమస్యలను పరిష్కరించండి

### జీవన్ ప్రమాణ్ పత్రాలు ఇచ్చినా పెన్షన్లు జమ చేయరా?
### రివైజ్డ్ పి.పి.ఓ ఆర్డర్ కాఫీలు వెంటనే ఇవ్వాలి.
### వితంతు పెన్షన్లు తొందరగా పరిష్కారం చేయాలి.
### సిఎంపిఎఫ్ కమీషనర్ ను కలిసిన ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య.

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** సింగరేణి లో 2021 జూలై 1 నుంచి పదవి విరమణ చేసిన ఉద్యోగుల యొక్క సవరించిన పెన్షన్ ను వెంటనే చెల్లించాలని, అదేవిధంగా పెన్షన్ ఏరియర్స్ బకాయిలు కూడా చెల్లించాలని, జనవరి నుంచి నిలిపి వేసిన పెన్షన్లు వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి గుర్తింపు సంఘం) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని సి.ఎం.పి.ఎఫ్ కార్యాలయంలో కమీషనర్ పచౌరి తో మాట్లాడి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఈ నెలలో బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సిన రెగ్యులర్ పెన్షన్ ను జీవన్ ప్రమాణ్ పత్రాలు ఆన్ లైన్ లో ఇచ్చినప్పటికిని ఎందుకు జమ చేయలేదని ఆయన కమీషనర్ ను ప్రశ్నించారు. పెన్షన్లు జమ చేయక పోవడం వల్ల చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు అనేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన తెలిపారు, వెంటనే నిలిపి వేసిన రెగ్యులర్ పెన్షన్లు రిటైర్డ్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, అదే విధంగా పదకొండవ వేజ్ బోర్డు లో దాదాపు వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగుల సవరణ పెన్షన్ ను వెంటనే చెల్లించాలని, పెరిగిన సవరణ పెన్షన్ ఏరియర్స్ కూడా చెల్లించాలని ఆయన కమీషనర్ ను డిమాండ్ చేశారు, రిటైర్డ్ ఉద్యోగులకు రివైజ్డ్ పెన్షన్ ఫేమేంట్ ఆర్డర్ కాఫీలు రాక చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారని, భర్త చనిపోతే భార్యకు వితంతు పెన్షన్ పొందేందుకు రివైజ్డ్ పి.పి.ఓ కాఫీ లేక పోవడం వల్ల వితంతు పెన్షన్ దారులు ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి వెంటనే రివైజ్డ్ పెన్షన్ ఫేమేంట్ ఆర్డర్ కాఫీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దన్ బాద్ లోని సి.ఎం.పి.ఎఫ్ కమీషనర్ కు లేఖను పంపుతామని, ఫిబ్రవరిలో రిటైర్డ్ ఉద్యోగుల పదకొండవ వేజ్ బోర్డు పెన్షన్ బకాయిలు చెల్లించాలని లేకుంటే ఏఐటియుసి ఆధ్వర్యంలో గోదావరిఖని సి.ఎం.పి.ఎఫ్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బాడీబిల్డింగ్ ప్రయాణం గమ్యం కాదు!!




### ఓర్పు, అభిరుచి, పట్టుదలతో మెడల్స్
### శారీరక, మానసిక దృఢత్వంతో ఛాంపియన్ షిప్
### "ట్రూ ఫిట్" పర్ఫెక్ట్ ప్లేస్ ఫర్ బాడీ ఫిట్
### రామగుండం బిజెపి నేత కందుల సంధ్యారాణి

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** బాడీబిల్డింగ్ ప్రయాణం.. గమ్యం కాదు అని రామగుండం బిజెపి నేత కందుల సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం రామగుండంలోని ట్రూ ఫిట్ జిమ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంధ్యారాణి పాల్గొని బాడీ బిల్డర్, విజేత ముజమ్మిల్ ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ....... ఈనెల 10వ తేదీ సోమవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో షఫీ సమీ క్లాసిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో ముజమ్మిల్ పాల్గొని ఐదవ స్థానంలో నిలవడం అభినందనీయమని అన్నారు. శారీరక, మానసిక దృఢత్వంతో ఛాంపియన్ షిప్ మెడల్స్ సాధ్యమని తెలిపారు. ఓర్పు, అభిరుచి, పట్టుదలతో కాంపిటీషన్లలో విజేతలుగా నిలవవచ్చని అన్నారు. "ట్రూ ఫిట్" పర్ఫెక్ట్ ప్లేస్ ఫర్ బాడీ ఫిట్ అని జిమ్ కోచ్, నిర్వాహకులను ప్రశంసించారు బిజెపి నేత సంధ్యారాణి. ఈ కార్యక్రమంలో షకీల్,సుధాకర్,దాసరి రాయలింగు,సింగం కిరణ్,ఆముల శ్రీనివాస్,ఆముల చరణ్,ప్రణయ్ గౌడ్,సమీర,ప్రవళిక,స్మీత,ప్రణయ తదితరులు పాల్గొన్నారు...

# పాము కాటుతో గొర్రెల కాపరి మృతి..!



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండలంలోని రొంపకుంట గ్రామానికి చెందిన కొయ్యడ రాజయ్య (53) అనే గొర్రెల కాపరి సోమవారం రాత్రి పాము కాటుకు గురై మృతి చెందాడు. ఇందుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామగుండం మండలం లక్ష్మీపురం శివారులో గొర్లను మెపడం కోసం మంద ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో మంద ఏర్పాటు చేసుకున్న ప్రదేశం ప్రక్కన నేలపై సదరు గొర్ల కాపరి నిద్రించాడు. ఈ క్రమంలో విష పురుగు పాము కాటు వేయడంతో సదరు వ్యక్తి అదే నిద్ర మత్తులో ప్రాణాలు వదిలాడు. సదరు బాధిత కుటుంబ సభ్యులు ఎన్. టీ. పీ. సీ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడంతో మృతుని భౌతిక కాయానికి గోదావరి ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు మృతుడికి భార్య స్వరూప, కుమాలు రమేష్, సంజీవ్ లు ఉన్నారు.బాధిత కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు ఎన్. టీ. పీ. సీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా మంథని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ జన్మదిన వేడుకలు



**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని పట్టణంలోని రాజగృహ లో మంగళవారం మంథని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ పుట్ట శైలజ జన్మదిన వేడుకలు వారి అభిమానులు, మహిళా నాయకురాలు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

# తెలంగాణ అభివృద్ధి కి పెట్టుబడులు పెట్టండి





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన అమెరికా కాంగ్రెస్ సభ్యులు సేనేటర్స్

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం)–:** తెలంగాణా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే అమెరికా వంటి దేశాలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా కాంగ్రెస్ సభ్యులను, సేనేటర్స్ నుఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అమెరికా కు చెందిన కాంగ్రెస్ సభ్యులు, సెనేటర్లు కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలు,ఐటి రంగాన్ని మరింత అభివృద్ధి,వాణిజ్య సంబంధాలు,విద్యా, వైద్య,మౌలిక వసతుల పై చర్చించారు.అమెరికా తెలంగాణ లో పెట్టుబడులు పెట్టితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి అమెరికా కాంగ్రెస్ సభ్యులకు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికల, పై అమెరికా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణా అభివృద్ధి కి తమవంతు సహాయసహకారాలు అందిస్తామని అమెరికా ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అమెరికా కాంగ్రెస్ సభ్యులు, సెన్ టర్లుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# పట్టణాల నుంచి పల్లెలకు పాకిన డ్రగ్స్ కల్చర్

**నిజామాబాద్ :** జిల్లాలో విద్యార్థులే టార్గెట్ గా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే హై స్కూల్ విద్యార్థులతో పాటు కాలేజీ విద్యార్థులకు గంజాయిని పరిచయం చేస్తున్నారు. లేత ప్రాయంలోనే పిల్లలను ఈ విషపు అలవాట్లు తమకు బానిసలుగా మార్చేసు కుంటున్నాయి. కొందరు గంజాయి వ్యాపారులు మార్గమేదైనా సరే, అడ్డగోలుగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో పిల్లల బంగారు భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల వ్యాపారంలోకి దిగి సమాజాన్ని నాశనం చేస్తున్నారు.



**గంజాయి చాక్లెట్లు.. సిగరెట్లు..**

స్కూల్ విద్యార్థులనే టార్గెట్ గా చేసుకుని చీకటి వ్యాపారులు గంజాయిని మిక్స్ చేసి తయారు చేసిన చాక్లెట్లను, సిగరెట్లను కొందరు గంజాయి విక్రేతలు స్టూడెంట్స్ కు రహస్యంగా అమ్ముతున్నారు. చదువులో వెనకబడిన వారిని, రఫ్ అండ్ టఫ్ గా ఉండి, అప్పుడప్పుడు గుట్కాతింటూ మొరటుగా కనిపించే కొంతమంది స్కూల్ విద్యార్థులను గుర్తించి వారిని ముందుగా ఈ గంజాయిని అలవాటు చేసేందుకు సెలెక్ట్ చేసుకుంటున్నారు. వారితో స్నేహం పెంచుకుని మెల్లిగా వారికి మందును అలవాటు చేయడం, దావత్ లతో వారితో పాటు కూర్చోనివ్వడం చేస్తారు. తరువాత నెమ్మదిగా వారి ఎదుటే గంజాయిని స్టయిల్ గా గంజాయిని పీలుస్తూ వారిలో ఆసక్తిని కలిగిస్తారు. వారి ఆసక్తిని గమనించాక కొద్దికొద్దిగా గంజాయిని వారికి అలవాటు చేస్తారు. ఇక అంతే కొద్దిరోజుల వరకు గంజాయిని ఫ్రీగా ఇచ్చి బాగా అలవాటయ్యాక డబ్బులుంటేనే ఇస్తామంటారు. దీని కోసం పిల్లలు ఇళ్లలో దొంగచాటుగా డబ్బులు తీసుకుని వచ్చి కొంటారు. కొద్ది రోజులు పోయాక మీకు గంజాయి ఫ్రీగా దొరకాలంటే మీలో కొందరికి అలవాటు చేయాలని, వారితో వ్యాపారం చేయాలని చిట్కాలు నేర్పుతారు. ఇలా ఈ అలవాటును పరిచయం చేసి వ్యసనంగా మార్చడమే కాకుండా వ్యాపారం లోకి కూడా దింపి పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు.

**యువకులను దందాలోకి దింపుతున్న వ్యాపారులు..**

చలాకీగా మాట్లాడి మాటలతో ఆకర్షించే లక్షణాలున్న 20 నుంచి 25 ఏళ్ల వయస్సులోపు యువకులను గంజాయి వ్యాపారులు ఈ దందాలో దింపుతున్నారు. తమకు నమ్మకంగా పనిచేస్తాడన్న నమ్మకమున్న కొందరిని కొద్ది నెలల పాటు గమనించి వ్యాపారులకు వారి మీద నమ్మకం కలగగానే ఈ దందాను వారికి పరిచయం చేసి వారికి వచ్చే లాభాలను వివరిస్తున్నారని తెలుస్తోంది. దందాలో దిగగానే టార్గెట్ లు ఫిక్స్ చేసి టార్గెట్ రీచ్ అయిన వారికి ఆకర్షణీయమైన ప్యాకేజీలతో కట్టిపడేస్తున్నారని సమాచారం. వీరు చేస్తున్న దందాను రహస్యంగా వీడియోలు తీసి, కస్టమర్లతో మాట్లాడుతున్న కాల్స్ ను రికార్డ్ చేసి వీరికి తెలియకుండానే దందా నిర్వహిస్తున్న ప్రధాన సూత్రధారులు తమ వద్ద భద్రంగా ఉంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడైనా వీరి వ్యాపార సంబంధాలు చెడి దందాను వదిలి వెళతానన్నా, లేదంటే దందా గురించి పోలీసులకు, మీడియాకు సమాచారం ఇద్దామనే ఆలోచన చేసినా వీరి వద్ద భద్రపరుచుకున్న వీడియోలు, కాల్ రికార్డ్ లతో బ్లాక్ మెయిల్ చేసి తమ గుప్పిట్లోనే ఉంచుకునేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఒక్కసారి ఈ దందాలో చిక్కుకున్నా, అలవాటుకు గురైనా బయట పడటం చాలా కష్టమని ఈ దందా గురించి బాగా తెలిసిన కొందరు చెపుతున్నారు.

**మెదడు పై ప్రభావం చూపుతున్న గంజాయి మత్తు..**

ఎండు గంజాయి నింపిన సిగరెట్లను తాగే అలవాటు చేసుకున్న విద్యార్థులు చదువులో పూర్తిగా వెనకబాటుకు గురై చాలా మంది పరీక్షల్లో ఫెయిలై భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లు తెలుస్తోంది. చాలా మంది సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు కూడా ఈ వ్యసనానికి బానిసలై జీవితాలు పాడు చేసుకున్న వారు ఉమ్మడి జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. గంజాయి, డ్రగ్స్ అలవాటున్న వారికి దీని ప్రభావం నేరుగా మెదడు పై చూపిస్తుందని, మత్తులోకి దిగాక తామేం చేస్తున్నామో, తమ హోదా, స్టేటస్, కుటుంబం, పరువు అన్నీ మరిచిపోయి ఓ ట్రాన్స్ లో ఉంటారని, వారేం చేస్తున్నారో వారికే తెలియని స్థితిలో దారుణాలు చేస్తారని నిపుణులు చెపుతున్నారు.

**నిజామాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో..**

డ్రగ్స్ కు బాగా బానిసైన నగరానికి చెందిన ఓ 30 ఏళ్ల గొప్పింటి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కొద్ది నెలల క్రితం ప్రైవేట్ హాస్పిటల్ లో హంగామా క్రియేట్ చేశారు. ఇన్ పేషెంట్ గా చికిత్స పొందుతున్న ఆయన హాస్పిటల్ లోని సీజర్ ను చేతిలో పట్టుకుని అందరినీ బెదిరిస్తూ, హాస్పిటల్ లోని అద్దాలు ధ్వంసం చేసి నడిరోడ్డుపైకి పరుగెత్తాడు. సుమారు గంటన్నర పాటు నడిరోడ్డుపైనే హాస్పిటల్ సిబ్బందికి, పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు చుక్కలు చూపించాడు. ఇలాగే బయటికి కనిపించని దృశ్యాలు ఎన్నో కుటుంబాల్లో వారికి కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి. మానసిక ప్రశాంతతను దూరం చేస్తున్నాయి. నగరంలో గ్యాంగ్ వార్ లో కత్తులు దూసుకుంటున్న వారిలో కూడా చాలా మంది యువకులు ఈ గంజాయి అలవాటుకు బానిసలైన వారున్నారని, ఆ మత్తులోనే చిన్న పాటి గొడవలకు సైతం కత్తులతో దాడులు చేసుకుంటున్నారని, ఒకరినొకరు పొడుచుకునే స్థాయికి వెళుతున్నారని తెలుస్తోంది. గంజాయి నియంత్రణకు ఎక్సైజ్, పోలీస్, టాస్క్ ఫోర్స్ అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో గంజాయి పై నియంత్రణ సాధించలేకపోతున్నారు. దీంతో గంజాయి స్మగ్లర్లు తమదైన శైలిలో వ్యాపారం కొనసాగిస్తుండటం సమాజానికి ప్రమాదకరంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# శివరాత్రి ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ సమీక్ష

**హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అవసరమైన ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఈఓలతో సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సమీక్షా సమావేశనీ నిర్వహించారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే వేములవాడ, కాళేశ్వరం, భద్రకాళి తదితర దేవస్థానాల్లో అవసరమైన ఏర్పాట్లపై అధికారులు మంత్రికి వివరించారు. గత ఏడాది శివరాత్రి నిర్వహణా అనుభవాల ఆధారంగా ఈ ఏడాది చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రధాననీగా క్యూ మేనేజ్ మెంట్, మంచి నీటి వసతి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, ఆరుబయట ప్రదేశాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, చలువ పందిళ్ల(తడకలతో) ఏర్పాటు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారుల నుండి మంత్రి సురేఖ వివరాలు సేకరించారు. మహాశివరాత్రి నేపథ్యనీలో శివాలయ క్షేత్రాలకి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పోలీస్ శాఖ సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆయా దేవాలయాలున్న పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో స్థానిక, ఆంగ్ల భాషల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్,



అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, వరంగల్ డిసి సంధ్యరాణి, ఆర్జేసీ రామకృష్ణ, హైదరాబాద్ డీసీ కృష్ణ ప్రసాద్, జిల్లా అసిస్టెంట్ కమిషర్లు, అన్ని ప్రముఖ శివాలయాల ఈవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సంక్రాంతికి వస్తున్నాం హీరోయిన్ కొత్త సిరీస్


ఈ మధ్య సీక్వెల్స్ అనేవి సర్వసాధారణమైపోయాయి. సినిమాలు, వెబ్ సిరీస్‌లు హిట్టయ్యాయంటే చాలు దానికి కొనసాగింపుగా రెండో భాగం, మూడో భాగం తీస్తూనే ఉన్నారు. తాజాగా తమిళ క్రైమ్ థ్రిల్లర్ 'సుడల్: ది వోర్టెక్స్' వెబ్ సిరీస్‌కు సీక్వెల్ రిలీజ్ డేట్ ప్రకటించారు. ఐశ్వర్య రాజేశ్ కదీర్ ప్రధాన పాత్రలో నటించిన ఈ థ్రిల్లర్ సిరీస్ ఫిబ్రవరి 28 నుంచి అమెజాన్ ప్రైమ్‌లోకి రానుంది. ఈ విషయాన్ని ప్రైమ్ వీడియో అధికారికంగా వెల్లడించింది. ఇది చూసిన అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. తమిళంలో వచ్చిన బెస్ట్ సిరీస్‌లో సుడల్ ఒకటి అని.. ఇన్నాళ్లకు రెండో పార్ట్ రిలీజ్ చేస్తుండటం సంతోషంగా ఉందని కామెంట్లు చేస్తున్నారు. సుడల్ మొదటి భాగం 2022లో అమెజాన్ ప్రైమ్‌లో రిలీజైంది. పార్తీబన్, కదీర్, ఐశ్వర్య రాజేశ్, శ్రేయారెడ్డి ముఖ్యపాత్రలు పోషించారు. పుష్కర్-గాయత్రి జంట కథ అందించగా బ్రహ్మ అనుచరణ్ దర్శకత్వం వహించారు. రెండో భాగానికి కూడా వీళ్లే పని చేస్తున్నారు.

**సుడల్ కథేంటి?**

తమిళనాడులోని సాంబలూరు అనే చిన్న గ్రామంలో ప్రజలు సిమెంట్ ఫ్యాక్టరీపై ఆధారపడి జీవనం సాగిస్తారు. ఆ ఫ్యాక్టరీ ప్రారంభించిన సమయంలో ఓ అమ్మాయి కనిపించకుండా పోతుంది. దాదాపు పాతికేళ్ల తర్వాత ఫ్యాక్టరీ తగలబడుతుంది. అప్పుడు ఫ్యాక్టరీ యూనియన్ లీడర్ షణ్ముఖం (పార్తిబన్) కూతురు నీల కనిపించకుండా పోతుంది. మరి ఆ అమ్మాయిలు ఏమయ్యారు? నీల సోదరి నందిని (ఐశ్వర్య రాజేశ్) సొంతూరిని వదిలేసి కోయంబత్తూరులో ఎందుకుంటోంది? ఈ మిస్సింగ్‌ల వెనక నీల హస్తం ఉందా? అనే ఆసక్తికర అంశాలతో సిరీస్ ఉత్కంఠగా సాగుతుంది. ఈ సిరీస్ మొత్తం ఎనిమిది ఎపిసోడ్‌లతో ఉంటుంది

## స్టార్ హీరోకు నాకు మధ్య గ్యాప్ వచ్చింది

### కారణం ఏంటో చెప్పిన శ్రీనివాస్ రెడ్డి



కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే నటుల్లో శ్రీనివాస్ రెడ్డి ఒకరు. కమెడియన్ గా ఎన్నో పాత్రల్లో మెప్పించారు ఈ టాలెంటడ్ నటుడు. తన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు శ్రీనివాస్ రెడ్డి. కమెడియన్ గానే కాదు హీరోగానూ సినిమాలు చేసి మెప్పించారు. ఎన్నో సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శ్రీనివాస్ రెడ్డి ఓ స్టార్ హీరో సినిమాలో మాత్రం ఎక్కువగా కనిపించడం లేదు. దాంతో ఆ స్టార్ హీరోకు శ్రీనివాస్ రెడ్డి మధ్య ఎదో అయ్యిందని గుసగుసలు వినిపించాయి. అయితే ఆ స్టార్ హీరో ఎవరు.? ఆయనకు శ్రీనివాస్ రెడ్డికి మధ్య ఏం జరిగిందో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. శ్రీనివాస్ రెడ్డి మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ తో ఎంతో క్లోజ్ గా ఉండేవారు. కానీ ఆతర్వాత ఈ ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చింది. దాని గురించి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నిజమే ఎన్టీఆర్ కు నాకు చిన్న గ్యాప్ వచ్చింది. మొదట్లో చాలా క్లోజ్ గా ఉండేవాళ్ళం. దాని తర్వాత ఆయనకు పెళ్లి అవ్వటం, నాకు పెళ్లి అవ్వటం, నేను వేరే సినిమాల్లో ఉండి ఇంపార్టెన్స్ లేకపోవడంతో నేను ఈ సినిమాలో చేయకూడదులే అనుకోవడం కావచ్చు. ఏదైనా చిన్న గ్యాప్ వచ్చిన మాట వాస్తవం. దానికి చుట్టుపక్క క్యారెక్టర్లు హెల్ప్ అవుతాయి. ఏదైనా మన గురించి ఒకటి చెవిలో పెడితే ఎన్టీఆర్ కూడా ఆలోచిస్తారు. కానీ ఫోర్స్ ఎక్కువ ఉంటే సరేలే అంటారు. ఆయనకు అది లేకపోయినా ఆ చుట్టుపక్కన ఉన్నోళ్ళు నన్ను కట్ చేసి ఉండొచ్చు. మంచి రిలేషన్ ఉండేది తారక్ తో నాకు. అప్పట్లో నేను ఆయన ఎలక్షన్ లో ప్రచారానికి వెళ్ళినప్పుడు. వాళ్ళు చేసిన ప్లాన్ అద్భుతం. ఇన్ని ఇంత ప్రచారం ఇంత గ్యాప్ లో ఆయనకి ఎంటర్ టైన్మెంట్ ఫ్రెండ్స్. ఫస్ట్ సెక్టార్ లో రాజీవ్ ఎంటర్ అవుతాడు. దాని తర్వాత సమీర్ ఎంటర్ అవుతాడు. దాని తర్వాత రాఘవ్ ఎంటర్ అవుతాడు. రఘు ఎంటర్ అవుతాడు. అందరూ ఫ్రెండ్స్ అందరూ బాగా క్లోజ్. నేను ఖమ్మం ఎంటర్ అయినప్పుడు నేను వస్తాలే అన్నాను చెప్పి ఖమ్మం ఎంటర్ అయిన దగ్గరనుంచి ఎన్టీఆర్ తో నేను ఉన్నాను. ఖమ్మంలో అద్భుతమైన సెలబ్రేషన్ జరిగింది. భారీ ఎత్తున జనం వచ్చారు. మొత్తం ఆ ప్రచారంలో ఖమ్మం టాప్. అది అయిపోయిన తర్వాత అందరం కార్లలో బయలుదేరాం. తారక్ కారులో ఎక్కాలి నేను. ఎక్కు అన్నాడు. నేను ఒక బ్యాగు తెచ్చుకున్నాను. ఆ బ్యాగు వెనక కారులో ఉంది తెచ్చుకుంటా అని అది తెచ్చుకునే లోపు ఇంకొకళ్ళు ఎవరో ఎక్కారు. ఆ బండి బయలుదేరిపోయింది. ముందు వెళ్ళిపోయింది అది. సర్లే అని నేను వెనక కారోలో ఎక్కా.. కొంచెం దూరం వెళ్ళిన తర్వాత ఓ బండి కింద పడి ఉంది. దిగి వెళ్తూ ఉంటే ఒక పిచ్చి అతను ఉన్నాడు. బాగా డస్టీగా.. ఒక పిచ్చి అతను. ఆయనతో ఎవరో మాట్లాడుతున్నారు. మేము అటు వెళ్లి ఆ బండి లాగి చూస్తే దాంట్లో తారక్ లేడు. ఎక్కడున్నాడబ్బా అని చూస్తే.. ఆ బాగా డస్టీగా పైనుంచి కింద దాకా అసలు గుర్తుపట్టే విధంగా తారక్ ఉన్నాడు. చూస్తే అదేంటన్నా ఎలా ఉన్నావంటే.. తలనుంచి బ్లడ్ వస్తుంది. నేను నా బ్యాగ్ లో ఉన్నటువంటి వాటిని తలకు చుట్టేసాను. ఆతర్వాత కిమ్స్ కి తీసుకొచ్చేశారు. ఆ ప్రాసెస్ లో ఒక అతను సడన్ గా కావాలని అన్నాడో లేకపోతే సెటైర్ గానో ఒక మాట అన్నాడు. నువ్వు అడుగుపెట్టావు యాక్సిడెంట్ అయింది అన్నాడు. నాకు కిందనుంచి మొత్తం షేక్ వచ్చింది బాడీ ఒకేసారి. ఏంది ఇంత మాట అనేశాడు అని నేను తిరిగి రీటర్న్ ఇచ్చాను.



## 'స్వాగ్' చూపించాడు.. 'సింగిల్' అవతారమెత్తాడు

విలక్షణ చిత్రాలతో యువ ప్రేక్షకుల్లో తనకంటూ ఒక ఫాలోయింగ్ సంపాదించుకున్న నటుడు.. శ్రీ విష్ణు. ముందు క్యారెక్టర్ రోల్స్ చేసినా.. తర్వాత హీరో పాత్రలకు మారి, హిట్లు కొట్టడంతో తన స్థాయి పెరిగింది. శ్రీ విష్ణు సినిమా అంటే ఏదో ఒక వైవిధ్యం ఉంటుందనే భరోసా ప్రేక్షకుల్లో ఉంది. గత ఏడాది అతను 'స్వాగ్' మూవీతో ప్రేక్షకులను పలకరించాడు. విడుదలకు ముందు ఈ సినిమా మంచి హైపే తెచ్చుకుంది. కానీ ఆ అంచనాలకు తగ్గట్లు సినిమా లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఐతే బాక్సాఫీస్ దగ్గర ఓ మోస్తరు ఫలితాన్ని అందుకున్న ఆ చిత్రం.. ఓటీటీలో మాత్రం మంచి ఆదరణ దక్కించుకుంది. కొన్ని రోజుల పాటు ఆ సినిమా సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. థియేటర్లలో సరిగా ఆడకపోయినా.. ఈ స్పందన శ్రీ విష్ణుకు ఆనందాన్ని ఇచ్చే ఉంటుంది. ఈ ఉత్సాహంలో అతను తన కొత్త సినిమాల పనిలో పడిపోయాడు. తన నెక్స్ట్ రిలీజ్‌కు సంబంధించి ఈ రోజు అప్‌డేట్ కూడా వచ్చింది.శ్రీ విష్ణు నటిస్తున్న కొత్త చిత్రం పేరు ఈ రోజు ప్రకటించారు. 'సింగిల్' అనే ట్రెండ్ టైటిల్ పెట్టారీ చిత్రానికి. సోషల్ మీడియా కాలంలో పెళ్లి కాని వారిని సింగిల్ అని సంబోధిస్తూ కామెంట్లు చేయడం కామన్. ఈ మాట బాగా పాపులర్ అయింది. కాబట్టి ఇది యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యే టైటిల్ అనే చెప్పాలి. ఈ సినిమా ఫస్ట్ లుక్ కూడా ఇంట్రెస్టింగ్‌గా కనిపిస్తోంది. శ్రీ విష్ణు నుంచి యూత్ ఆశించే అల్లరి ఈ సినిమాలో ఉంటుందనే అనిపిస్తోంది. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ లాంటి పెద్ద నిర్మాణ సంస్థ ప్రొడ్యూస్ చేస్తుండడం విశేషం.




## బ్యాడ్ లక్ అంటే ఈ అమ్మడిదే!

### యంగ్ హీరో సినిమా కోసం 1000కోట్ల సినిమాను మిస్ చేసుకుంది

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్స్ అవకాశాల కోసం ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ.. దూసుకుపోతున్నారు. కొంతమంది స్టార్ హీరోల సినిమాల కోసం ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.అలాగే మరికొంతమంది. డేట్స్ అడ్జెస్ట్ అవ్వక ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకుంటారు. తాజాగా ఓ హీరోయిన్ యంగ్ హీరో సినిమా కోసం ఏకంగా రూ. 1000 కోట్ల భారీ సినిమా ఆఫర్ మిస్ చేసుకుంది. ఇంతకూ ఆ హీరోయిన్ ఎవరో తెలుసా.? అవకాశం తలుపు తట్టడమే గొప్ప విషయం. కానీ ఈ అమ్మడి భారీ బ్లాక్ బస్టర్ సినిమాను మిస్ చేసుకోవడంతో అభిమానులు తెగ ఫీల్ అవుతున్నారు. ఇంతకూ ఆ అమ్మడు ఎవరు.? ఆమె మిస్ చేసుకున్న భారీ బడ్జెట్ మూవీ ఏది.? ఒక్కసారి చూద్దాం.! యంగ్ హీరో సినిమా కోసం భారీ బ్లాక్ బస్టర్ మూవీ మిస్ చేసుకున్న హీరోయిన్ ఎవరో కాదు. లైగర్ బ్యూటీ అనన్య పాండే. బాలీవుడ్ లో ఈ భామ క్రేజీ హీరోయిన్ గా పేరుతెచ్చుకుంది. తన అందాలతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది ఈ వయ్యారి. ఇక తెలుగులో అనన్య విజయ్ దేవరకొండ హీరోగా నటించిన లైగర్ సినిమాతో పరిచయం అయ్యింది. పూరిజగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. దాంతో తిరిగి బాలీవుడ్ కు చెక్కేసింది. ఇటీవలే ఆమె తండ్రి లైగర్ సినిమాను అనన్య అయిష్టంగానే ఒప్పుకుందని షాకింగ్ కామెంట్స్ చేశారు. అనన్య నటించిన సినిమాలు ప్రేక్షకులను మెప్పించలేకపోతున్నాయి. ఆమె చేసిన సినిమాలన్ని వరుసగా ఫ్లాప్ అవుతున్నాయి. దాంతో ఓ భారీ సక్సెస్ కోసం ఎదురుచూస్తుంది. ఈ నేపథ్యంలో ఆయనకు డైరెక్టర్ ఇంతియాజ్ అలీ తెరకెక్కిస్తున్న సినిమాలో ఆఫర్ వచ్చిందట. బాలీవుడ్ లో ఇంతియాజ్ అలీ ప్రేమకథలు తెరకెక్కించడంలో దిట్ట. ఆయనతో సినిమా చేయడానికి స్టార్ నటీనటులు ఎదురుచూస్తారు. ఇంతియాజ్ అలీ ఓ భారీ బడ్జెట్ సినిమాను ప్లాన్ చేస్తున్నాడు. ఆ సినిమాలో హీరోయిన్ గా అనన్యను అనుకున్నారట. అయితే కార్తీక్ ఆర్యన్ సినిమా షూటింగ్ లో ఉండటంతో డేట్స్ అడ్జెస్ట్ కాక ఇంతియాజ్ అలీ సినిమాను రిజెక్ట్ చేసిందట. ఇప్పుడు ఇదే వార్త బాలీవుడ్ లో జోరుగా షికారు చేస్తుంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com